వైసీపీ గ్యాంగ్‌కు షాక్

విస్సన్నపేట భూములపై వీఎంఆర్‌డీఏ దృష్టి

- లేఅవుట్‌కు అసలు అనుమతి తీసుకోలేదని గుర్తింపు
- అమ్మకాలు నిలిపివేయాలని 'వింటేజ్ మౌంట్ వేలీ రిసార్ట్స్' పేరుతో ప్లాట్లు విక్రయిస్తున్న కంపెనీకి నోటీస్
- ఆ సంస్థ చేతిలో 400 ఎకరాలు
- అటుఇటు వైసీపీ పెద్దలకు 210 ఎకరాలు
- గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొండలు, గుట్టలు కొట్టి, గెడ్డలు కప్పి వందలాది ఎకరాలు చదునుచేసిన వైనం
- నేతల ఒత్తిడితో చేతులు మారిన అసైన్డ్ భూములు
- వెలుగులోకి తెచ్చిన 'ఆంధ్రజ్యోతి'
- అయినా పట్టించుకోని నాటి పాలకులు
- ప్రభుత్వం మారడంతో అధికారుల్లో స్పందన
- ఆ భూములపై రెవెన్యూ శాఖ విచారణ చేపట్టాలని డిమాండ్


కశింకోట మండలం విస్సన్నపేట వివాదాస్పద భూముల్లోని లేఅవుట్‌లో విశాలమైన రోడ్డు

(అనకాపల్లి/విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ గ్యాంగ్ అనకాపల్లి జిల్లాలో పాల్పడిన భూ అక్రమాలపై ప్రభుత్వ యంత్రాంగం స్పందించింది. కశింకోట మండలం విస్సన్నపేట పంచాయతీ బయ్యవరం గ్రామంలో ప్రభుత్వ భూములు, కొండలు, అసైన్డ్ భూములు ఆక్రమించి వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేతలు వందలాది ఎకరాల్లో భారీ లేఅవుట్ వేసిన సంగతి తెలిసిందే. దీనిపై అనేకసార్లు 'ఆంధ్రజ్యోతి' కథనాలు ప్రచురించినా అప్పటి వైసీపీ ప్రభుత్వం స్పందించలేదు. ఈ వ్యవహారాన్ని అప్పటి అనకాపల్లి జిల్లా వైసీపీ అధ్యక్షుడు దగ్గరుండి నడిపించగా మంత్రి ఒకరు అండగా నిలిచారని, వైసీపీకి చెందిన రాజ్యసభ సభ్యుడు ఒకరికి, విజయనగరం జిల్లాకు చెందిన నాయకుడికి వాటాలు ఉన్నాయనే ఆరోపణలు వచ్చాయి. వారి బినామీగా ప్రచారంలో ఉన్న ఎస్ఆర్ షాపింగ్‌మాల్ అధినేత గోపీనాథ్‌రెడ్డి పేరిట అక్కడ ఎక్కువ భూములు ఉన్నాయి. అప్పుడు టీడీపీ, జనసేన నాయకులు ఎన్ని ఫిర్యాదులు చేసినా ఒక్క అధికారి కూడా స్పందించలేదు. అనకాపల్లి రెవెన్యూ అధికారులు లేఅవుట్ భూములు పరిశీలించినా చర్యలు చేపట్టలేదు. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో అధికారుల్లో చలనం వచ్చింది.

కశింకోట మండలం విస్సన్నపేటలో లేఅవుట్‌కు ఎటువంటి అనుమతులు లేవని, కానీ ప్లాట్లుగా విభజించి విక్రయిస్తున్నారని, తక్షణమే దీనిపై చర్యలు తీసుకోవాలంటూ వీఎంఆర్‌డీఏ నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన కేఎస్ విశ్వనాథన్‌కు రెండు రోజుల క్రితం విశాఖకు చెందిన జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఫిర్యాదు చేశారు. ఆయన ఆ ఫిర్యాదును ప్లానింగ్ విభాగానికి పంపి విచారణ చేయాలని ఆదేశించారు. గతంలో వచ్చిన ఫిర్యాదులపై క్షేత్రస్థాయి నివేదిక తెప్పించుకున్న ప్లానింగ్ విభాగం అధికారులు ఆ లేఅవుట్‌కు అనుమతులు లేవని, కనీసం దరఖాస్తు కూడా చేయలేదని నిర్ధారించుకొని అక్కడ 400 ఎకరాల్లో పనులు చేపడుతున్న నవ్య కనస్ట్రక్షన్స్ కంపెనీకి నోటీసు జారీచేశారు. వీఎంఆర్‌డీఏ అనుమతి లేకుండా లేఅవుట్ వేయకూడదని, భూమి అభివృద్ధి పనులు కూడా చేపట్టకూడదని పేర్కొన్నారు. వందల ఎకరాల్లో లేఅవుట్ కాబట్టి పర్యావరణ అనుమతులు కూడా అవసరమని, ఎటువంటి నిబంధనలు పాటించకుండా లేఅవుట్ వేసి, ప్లాట్లు అమ్ముతున్నందున తక్షణమే ఆయా అభివృద్ధి పనులతో పాటు, మార్కెటింగ్ కూడా నిలిపివేయాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసి, వీఎంఆర్‌డీఏకు డెవలప్‌మెంట్ చార్జీలు చెల్లించి అనుమతి తీసుకోవాలని సూచించారు. కాదని పనులు కొనసాగిస్తే అక్కడ భూమి విలువ (రిజిస్ట్రేషన్)పై 20 శాతం జరిమానా చెల్లించాల్సి ఉంటుందని, జైలు శిక్ష కూడా ఉంటుందని స్పష్టంచేశారు.

అడ్డగోలు వ్యవహారం

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

అనకాపల్లి నియోజకవర్గం కశింకోట మండలం బయ్యవరం రెవెన్యూ పరిధి విస్సన్నపేట సర్వే నంబర్లు 2, 108, 195/2, 624లలో గల సుమారు 609.24 ఎకరాలలో ఎటువంటి అనుమతులు తీసుకోకుండా వైసీపీ మాజీ మంత్రి అనుచరులు వైశాఖి వ్యాలీ, వింటేజ్ మౌంట్ వేలీ రిసార్ట్స్ పేరుతో భారీ లేఅవుట్ వేసిన సంగతి తెలిసిందే. ఈ లేఅవుట్‌లో కొంతమేర జిరాయితీ భూములు కాగా, సుమారు 300 ఎకరాలు ప్రభుత్వ బంజరు, డీపట్టా భూములు, కొండలు, వాగులు, గోర్జలు, పంట కాలువలు ఉన్నాయి. రెవెన్యూ రికార్డుల ప్రకారం 195/2 సర్వే నంబరులో 49.66 ఎకరాలు రంగబోలు గెడ్డగా నమోదైంది. ఈ గెడ్డకు కొండవాలు ప్రాంతాల నుంచి జాలువారేందుకు గతంలో ఉన్న గోర్జలు, పంట కాలువలు, వాగులు కనుమరుగయ్యాయి. ఇదే సర్వే నంబరులో 1975 కాలంలో కొంత మంది ఎస్సీ, ఎస్టీలకు అప్పటి ప్రభుత్వం సాగు కోసం పట్టాలు ఇచ్చింది. వారసుల ఆధీనంలో ఉన్న డీపట్టా భూములను మాజీ మంత్రి అనుచరులు కారు చౌకగా చేజిక్కించుకున్నారు. ప్రస్తుతం డీపట్టా భూములు కూడా మంత్రి అనుచరులు అక్రమంగా వేస్తున్న లేఅవుట్‌లో కలిపేసుకున్నారు.

కాదంటే 20 శాతం జరిమానా

బయ్యవరంలో ఎకరా భూమి విలువ రూ.40 లక్షలుగా ఉంది. నిబంధనల ప్రకారం ఎకరాకు లక్ష రూపాయల చొప్పున డెవలప్‌మెంట్ చార్జీలు కట్టాల్సి ఉంటుందని వీఎంఆర్‌డీఏ సీయూపీ సంజయ్ రత్నకుమార్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. అలా కాకుండా పనులు కొనసాగిస్తే అక్కడి భూమి విలువపై 20 శాతం జరిమానా చెల్లించాల్సి ఉంటుంది.

మధ్యలో నవ్య...అటు ఇటు వైసీపీ నేతలు?

విస్సన్నపేటలో వందలాది ఎకరాల్లో లేఅవుట్ వేశారు. అందులో 400 ఎకరాలు నవ్య కనస్ట్రక్షన్స్ కంపెనీదిగా చెబుతున్నారు. ఆ సంస్థ వింటేజ్ మౌంట్ వేలీ రిసార్ట్స్ పేరుతో ప్లాట్లు విక్రయిస్తోంది. ఈ భూమికి అటు, ఇటు బినామీ పేర్లతో వైసీపీ నేతలు చేజిక్కించుకున్న భూములు ఉన్నాయని తెలిసింది. వారు 'వైశాఖి వేలీ' పేరుతో ప్లాట్ల విక్రయాలు చేస్తున్నారు.

భూముల హక్కులపై విచారణ జరగాలి

పీతల మూర్తియాదవ్ ఫిర్యాదుతో అక్రమ లేఅవుట్‌గా గుర్తించి వీఎంఆర్‌డీఏ నోటీసులు జారీచేసింది. నవ్య కంపెనీ తమది 400 ఎకరాలుగానే చెబుతోంది. అంటే మిగిలిన 210 ఎకరాల భూములు అడ్డగోలుగా చేజిక్కించుకున్నదని అర్థమవుతోంది. ఇప్పుడు రెవెన్యూ అధికారులు కూడా రంగంలోకి దిగి ఆ భూములన్నీ ఎవరివి?, ఎవరి చేతుల్లోకి వెళ్లాయి?, ప్రస్తుతం ఎవరి ఆధీనంలో ఉన్నాయి?, ఏ హక్కుతో విక్రయిస్తున్నారో విచారణ చేయించాల్సి ఉంది. కొండలు, గెడ్డలు ఆక్రమించిన వారిపై చర్యలు చేపట్టాల్సి ఉంది. వీఎంఆర్‌డీఏతో పాటు అనకాపల్లి జిల్లా అధికారులు కూడా దీనిపై స్పందించాల్సి ఉంది.


ఏరియా ఆస్పత్రి నుంచి రోగిని 108లో విశాఖపట్నం తరలిస్తున్న దృశ్యం (ఫైల్)

అంబులెన్స్‌ల సేవలు అంతంత మాత్రమే..

నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి పరిధిలో ఏడు 108 వాహనాలు

- అందులో ఆరు పాతవి
- తరచూ మొరాయింపు
- రిఫరల్ కేసులను విశాఖపట్నం తరలించడానికి వినియోగం
- అత్యవసర సమయాల్లో గ్రామీణ వాసులకు అందని సేవలు

నర్సీపట్నం, జూలై 25:

స్థానిక ప్రాంతీయ ఆస్పత్రిలోని కాలం చెల్లిన అంబులెన్స్‌లతో ఇబ్బందులు తప్పడం లేదు. అవి ఎప్పుడు, ఎక్కడ ఆగిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ ఆస్పత్రి పరిధిలో ఏడు వాహనాలు ఉంటే, వాటిలో ఆరు పాతవే. గత ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా కొత్త అంబులెన్స్‌లను మంజూరు చేయగా, ఇక్కడకు మాత్రం పాత వాటికి రంగులు వేసి ఇచ్చారు. ప్రస్తుతం తిరుగుతున్న అంబులెన్స్‌లు ఆరు లక్షల కిలో మీటర్లు పైగా తిరగడంతో తరచూ మరమ్మతులకు గురై ఆగిపోతున్నాయి.

నిండు గర్భిణులను, ప్రమాదాలతో తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న క్షతగాత్రులు, విష సర్పాల బారిన పడి చావుబతుకుల్లో ఉన్న రోగులను అత్యవసరంగా ప్రభుత్వాస్పత్రులకు తరలించడానికి 108 అంబులెన్స్‌లు నిత్యం అందుబాటులో ఉండాలి. అయితే 108 కాల్ సెంటర్‌కి ఫోన్ చేస్తే వాహనాలు ఖాళీ లేవని సమాధానం వస్తోంది. ఏరియా ఆస్పత్రి, పీహెచ్‌సీల నుంచి రిఫరల్ కేసులు విశాఖపట్నం తరలించడానికి వాడుతుండడంతో గ్రామీణ ప్రాంత ప్రజలకు అంబులెన్స్ సేవలు అందడం లేదు. ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి ఆస్పత్రికి రావల్సి వస్తోంది. 108 అంబుల్స్‌ల పరిధి 30 నుంచి 40 కిలోమీటర్లు ఉంటుంది. పరిధి దాటితే రోగిని మరో వాహనంలోకి మార్చి ఆస్పత్రికి తరలించేవారు. రిఫరల్ కేసులు వల్ల ఒక్కొక్క వాహనం రోజుకి 400 కిలో మీటర్లు తిరగవలసి వస్తున్నది. దీని వల్ల సిబ్బంది పని భారంతో ఇబ్బంది పడుతున్నారు.

సిబ్బంది కొరత

ఏరియా ఆస్పత్రి పరిధిలో ఏడు వాహనాలు తిరుగుతున్నాయి. ఒక్కొక్క వాహనంలో పైలట్ (డ్రైవరు), ఈఎంటీ ఉంటారు. ఏడు వాహనాలకు 14 మంది సిబ్బందితో పాటు అదనంగా షిఫ్ట్ డ్యూటీలు చేసే సిబ్బంది ఉండాలి. నలుగురు ఈఎంటీ పోస్టులు భర్తీ చేయడం లేదు. దీంతో ఉన్న సిబ్బంది మీద పని భారం పడుతోంది. రెండు నెలలుగా జీతాలు అందకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని సిబ్బంది వాపోతున్నారు. ప్రతీ నెలా ఒకటో తేదీకి జీతాలు వస్తేగాని బతకడం కష్టమని అంటున్నారు. గత ఐదేళ్లుగా ఇంక్రిమెంట్లు పడడం లేదని వాపోయారు. గత ప్రభుత్వం ప్రతీ సంవత్సరం 10 శాతం ఇంక్రిమెంట్‌లు ఇస్తామని చెప్పి అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.


నిర్మాణ దశలో ఉన్న మెడికల్ కాలేజీ భవనాలు

మందకొడిగా మెడికల్ కాలేజీ పనులు

గత వైసీపీ ప్రభుత్వం బిల్లుల మంజూరులో తీవ్ర జాప్యం

- బిల్లులు రాక ముందుకు సాగని పనులు

మాకవరపాలెం, జూలై 25: మండలంలోని భీమబోయినపాలెం గ్రామంలో చేపట్టిన మెడికల్ కాలేజీ భవనాల నిర్మాణ పనులు మందకొడిగా సాగుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం బిల్లులను సకాలంలో విడుదల చేయకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. కూటమి ప్రభుత్వం హయాంలో ఈ నిర్మాణాలు పూర్తవుతాయని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని భీమబోయినపాలెం గ్రామంలో 52.15 ఎకరాల డీ పట్టా భూములను గత వైసీపీ ప్రభుత్వం తీసుకుని సాగుదారులకు ఎకరా భూమికి సుమారు రూ.21 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించింది. అయితే 32.3 ఎకరాల్లో మెడికల్ కాలేజీ నిర్మించాలని నిర్ణయించి హైదరాబాద్‌కు చెందిన నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీకి 2022లో నిర్మాణ బాధ్యతలను అప్పగించింది. 2023 జనవరిలో ఈ పనులను అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ పనులు 30 నెలల్లో పూర్తి చేయాలని గడువు విధించారు. మెడికల్ కాలేజీ భవనాల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ వాటా రూ.350 కోట్లు కాగా, రాష్ట్రం వాటా రూ.150 కోట్లు. భవనాల నిర్మాణ బాధ్యతలు చేపట్టిన సంస్థ ఇప్పటి వరకు 25 శాతం పనులు పూర్తి చేసింది. అయితే కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు వచ్చినా రాష్ట్రం వాటా విడుదల చేయలేదని తెలిసింది. అందు వల్ల కాంట్రాక్ట్ సంస్థకు రూ.11 కోట్లు మాత్రమే చెల్లించి మరో రూ.13 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో పెట్టినట్టు సమాచారం. దీంతో పనులు ముందుకు సాగడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన నేపథ్యంలో ఈ పనులు పూర్తవుతాయని అందరూ భావిస్తున్నారు.

ఐఐటీ, ఎన్ఐటీల స్థాయికి ఏయూ

నేషనల్ యూనివర్సిటీల మాదిరిగా బ్రాండ్ క్రియేట్ చేయడమే లక్ష్యం

- అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ప్రణాళిక
- వర్సిటీని రాజకీయాలకు దూరంగా ఉంచడమే ప్రథమ కర్తవ్యం
- ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకును మెరుగుపరుచుకునేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపకల్పన
- పరిశోధనలను ప్రోత్సహిస్తాం
- ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్త కోర్సులు
- శతాబ్ది ఉత్సవాలు బ్రహ్మాండంగా నిర్వహిస్తాం
- ప్రధానిని ఆహ్వానించే ఆలోచనలు ఉన్నాయి
- ఏయూను జాతీయ స్థాయిలో ముందువరుసలో నిలపడమే ధ్యేయం
- విద్యార్థులు ఏ సమస్యా ఉన్నా నా దృష్టికి తీసుకురావచ్చు

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు


ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు

విశాఖపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి):

"ఐఐటీ, ఎన్ఐటీల స్థాయిలో ఏయూను తీర్చిదిద్దుతాం. నేషనల్ యూనివర్సిటీల మాదిరిగా ఏయూకు బ్రాండ్ క్రియేట్ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇందుకు ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేశా. ఐఐటీ, ఎన్ఐటీల్లో చదువుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు చూడగానే ఇంటర్వ్యూ, టెస్ట్ లేకుండా ఉద్యోగాలు ఇస్తున్నారు. అదేస్థాయికి వర్సిటీని తీసుకువెళతాం' అని అంటున్నారు ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు. ఇన్‌చార్జి వీసీగా కొద్దిరోజుల కిందట బాధ్యతలు స్వీకరించిన ఆయన గురువారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో యూనివర్సిటీలో నియామకాలు, కొత్త కోర్సుల ప్రారంభం, వందేళ్ల ఉత్సవాలు సహా అనేక అంశాలపై మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

[ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ]

ఏయూ అభివృద్ధికి సంబంధించి ప్రత్యేక ప్రణాళిక

యూనివర్సిటీ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేశాను. విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది సహకారంతో వర్సిటీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళతాను. ముఖ్యంగా రాజకీయాలకు వర్సిటీని దూరంగా ఉంచడమే లక్ష్యంగా పెట్టుకున్నా. పొలిటికల్ ఫ్రీ క్యాంపస్ చేయడమే నాముందున్న ప్రథమ కర్తవ్యం. అకడమిక్స్ క్వాలిటీని ఇంప్రూవ్ చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశాను. ఐఐటీ, ఎన్ఐటీ స్థాయికి వర్సిటీని తీసుకువెళతాను. గత కొన్నాళ్లుగా నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)లో వర్సిటీకి మెరుగైన ర్యాంకు రాలేదు. ఈ ర్యాంకు మెరుగుపర్చుకోవడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేశా. ప్రస్తుతం ఏయూకు ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకు 76. రానున్న ఏడాదిలో 30 నుంచి 40 మధ్యలో తెచ్చుకోవడంపై దృష్టిసారించా. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంక్ క్వాలిటీ ఆఫ్ ఎడ్యుకేషన్‌ను తెలియజేస్తుంది. 50 లోపు ర్యాంకు ఉంటే కేంద్ర సంస్థలు, ఇతర ఆర్గనైజేషన్ నుంచి సుమారు రూ.100 కోట్లు వరకు ప్రాజెక్టులు వచ్చేందుకు అవకాశం ఉంది. ఈ నిధులు వర్సిటీలో అభివృద్ధికి, పరిశోధనలు పెరగడానికి దోహదం చేస్తాయి.

పరిశోధనలు పెరగాలి..

యూనివర్సిటీలో పరిశోధనలు పెరగాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా ప్రోత్సహిస్తాం. ఈ మేరకు వర్సిటీలోని ప్రిన్సిపాళ్లు, డీన్లుకు ప్రత్యేక ఆదేశాలు ఇచ్చాం. ప్రిన్సిపాల్స్ కూడా తప్పనిసరిగా ఒక సబ్జెక్ట్ బోధించాలని ఆదేశాలు జారీచేశాం. టైమ్ టేబుల్, అకడమిక్ క్యాలెండర్‌ను తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టంచేశాం. ముఖ్యంగా ప్రతి విభాగంలో పరిశోధన ప్రాజెక్టులు ప్రోగ్రెస్‌లో ఉండేలా చూడాలని ఆదేశించాం. కొన్నిచోట్ల పరిశోధనలు ఉన్నా..పబ్లికేషన్స్ ... మిగతా 7వ పేజీలో

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అదనపు సౌకర్యాలు

- జిల్లా రిజిస్ట్రార్ సీహెచ్ జానకిదేవి


సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సందర్శించిన జిల్లా రిజిస్ట్రార్ సీహెచ్.జానకిదేవి

కె.కోటపాడు, జూలై 25: జిల్లాలోని 10 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అదనపు సౌకర్యాలు కల్పిస్తున్నామని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ జిల్లా రిజిస్ట్రార్ సీహెచ్ జానకిదేవి తెలిపారు. గురువారం కె.కోటపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. కార్యాలయానికి కావాల్సిన ఫర్నిచర్, రికార్డులు భద్రపరిచే బీరువాలు, కార్యాలయం బయట సీసీ కెమెరాల ఏర్పాటు తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 2023లో 20 వేలు డాక్యుమెంట్లు చేశామని, ఈ ఏడాది 13 వేలు మాత్రమే చేయగలగామన్నారు. నాలుగు నెలల నుంచి ఎన్నికలు, మంచి ముహూర్తాలు లేకపోవడం తదితర కారణాల వల్ల రిజిస్ట్రేషన్లు తగ్గాయన్నారు. జిల్లాలో కె.కోటపాడు, నక్కపల్లి, మాడుగుల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, వీటికి త్వరలో స్థలం సమకూర్చవలసిందిగా కలెక్టర్‌ను కోరామన్నారు. మిగిలిన భవనాలు కూడా శిథిలావస్థలో ఉండడంతో పక్కా భవనాలకు నిధులు మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరినట్టు ఆమె తెలిపారు. జిల్లాలో లంకెలపాలెం, ఎలమంచిలి తప్ప మిగిలిన కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు పూర్తిగా తగ్గుముఖం పట్టాయని తెలిపారు. ఆమెతో పాటు స్థానిక సబ్ రిజిస్ట్రార్ బంగారి వెంకటేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యం

- డీఆర్‌డీఏ పీడీ శచిదేవి


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శచిదేవి

నర్సీపట్నం, జూలై 25: ఈ ఏడాది 6,500 మంది డ్వాక్రా మహిళలను లక్షాధికారులను చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని డీఆర్‌డీఏ పీడీ శచిదేవి తెలిపారు. గురువారం నర్సీపట్నం క్లస్టర్ పరిధిలోని నర్సీపట్నం, మాకవరపాలెం, గొలుగొండ, నాతవరం, రోలుగుంట మండలాల ఏపీఎంలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్వాక్రా రుణాలు ఇప్పించడంతో పాటు సకాలంలో రుణాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిశ్రమలు పెట్టుకోవడానికి ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ స్కీమ్ పథకంలో డ్వాక్రా మహిళలకు రుణాలు ఇప్పిస్తామని చెప్పారు. ఈ ఏడాది 6500 మంది డ్వాక్రా మహిళలను లక్షాధికారులను చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ మహిళలకు ఉన్నతి కార్యక్రమంలో భాగంగా రూ.8.5 కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ డైజీ, ప్రాంతీయ సమన్వయకర్త కె.సత్యనారాయణ, డీపీఎం శ్రీనివాస్, వరప్రసాద్, రమణ, ఐదు మండలాల ఏపీపీఎంలు పాల్గొన్నారు.

డీసీసీబీ లాభం రూ.1.6 కోట్లు

మొత్తం వ్యాపారం రూ.2217.55 కోట్లు

- రుణాలు రూ. 1289.16 కోట్లు
- డిపాజిట్లు రూ.923.39 కోట్లు
- ప్రతి సొసైటీలో ఆధ్వరంలో పెట్రోల్ బంకు ఏర్పాటు
- ఎరువుల వ్యాపారం కూడా...
- జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మహాజన సభ ఆమోదం


డీసీసీబీమహాజన సభలో మాట్లాడుతున్న బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి, విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

విశాఖపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి):

విశాఖ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) ఈ ఏడాది మార్చి 31తో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరంలోరూ.1,60,02,106 నికర లాభం సాధించినట్టు ప్రకటించింది. మొత్తం రూ.2,217.55 కోట్ల వ్యాపారం చేసింది. రూ.1289.16 కోట్లు రుణాలుగా ఇవ్వగా, రూ.928.39 కోట్లు డిపాజిట్లుగా సేకరించింది. బంగారు ఆభరణాలపై రూ.289.56 కోట్లు, దీర్ఘకాలిక రుణాలు రూ.19.24 కోట్లు, స్వల్పకాలిక రుణాలు రూ.113.26 కోట్లు, పంట రుణాలు 425.9 కోట్లు, ఇతర రుణాలు 441.20 కోట్లు ఇచ్చింది. మొత్తం వ్యాపారంపై రూ.3.13 కోట్ల స్థూల లాభం ఆర్జించగా పన్నులు, ఖర్చులు తీసివేస్తే నికరంగా రూ.1.6 కోట్లు లాభం వచ్చినట్టు ప్రకటించింది. గురువారం మర్రిపాలెంలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో పర్సన్ ఇన్‌చార్జి, విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ అధ్యక్షతన నిర్వహించిన మహాజన సభలో గడచిన ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వ్యాపార లావాదేవీలు, ఆడిట్ రిపోర్టుపై చర్చించి ఆమోదించారు.

ఉమ్మడి జిల్లాకు సంబంధించి అనకాపల్లి జిల్లాలో 74, విశాఖ జిల్లాలో 14, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 10 సొసైటీలు ఉన్నాయి. ప్రాథమిక సహకార సొసైటీలు వ్యాపార విస్తరణలో భాగంగా ప్రతి మండలంలో ఒక పెట్రోల్‌బంకు ఏర్పాటుచేయాలని, ఎరువుల వ్యాపారం నిర్వహించాలని, అందుబాటులోకి వచ్చిన గోదాములను ఖాళీగా ఉంచకుండా వ్యాపార కార్యకలాపాలకు కేటాయించాలని సభ తీర్మానించింది. ఈ సందర్భంగా పర్సన్ ఇన్‌చార్జి మయూర్ అశోక్ మాట్లాడుతూ సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జిలుగా కొనసాగుతున్న అధికారులు వ్యాపార విస్తరణ చేపట్టి లాభాలు ఆర్జించేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. త్వరలో ప్రతి సొసైటీ అధికారులతో సమీక్ష నిర్వహిస్తామన్నారు. సొసైటీల నిర్వహణలో పారదర్శకత ఉండాలని, అవినీతికి చోటులేని పాలన అందించాలని ఆదేశించారు. మహాజన సభలో బ్యాంకు సీఈవో డీవీఎస్ వర్మ, అనకాపల్లి జిల్లా సహకార అధికారి ప్రేమ స్వరూపరాణి, ఆడిట్ అధికారి డి.గోవిందరావు, సొసైటీల పర్సన్ ఇన్‌చార్జులు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

క్రైం... crime news

రూ.34 వేల కలప స్వాధీనం

కొయ్యూరు, జూలై 25: అక్రమంగా రవాణా చేసేందుకు సిద్ధం చేసిన కలపను అటవీశాఖ సిబ్బంది గురువారం స్వాధీన పరచుకున్నారు. ఇందుకు సం బంధించి పెదవలస రేంజ్ అధికారి శివరంజని తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాకరపాడు బీట్ పరిధి ఆడా కులు, బాలారం సరిహద్దుల్లో కలప అక్రమ రవాణాకు సిద్ధం చేసినట్టుగా అందిన విశ్వసనీయ సమాచారంతో గురువారం ఉద యం అటవీ శాఖ సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ దాడులలో 10 నల్లమద్ది దుంగలను స్వాధీన పరుచుకుని కాకరపాడు అటవీ డిపోకు తరలించారు. వీటి విలువ సుమారు రూ.34 వేలు ఉంటుందని శివరంజని తెలిపారు. ఈ దాడులలో ఎఫ్‌ఎస్‌వో నూకరాజు, ఎఫ్‌బీవో రమణ, భూషణం, నాగేశ్వరావు, గోపి పాల్గొన్నారు.

ట్రావెల్స్ డ్రైవర్‌పై కేసు నమోదు

కశింకోట, జూలై 25: విశాఖపట్నం శ్రీదేవి ట్రావెల్స్‌కు చెందిన డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు సీఐ వినోద్‌బాబు తెలిపారు. రాజమండ్రికి చెందిన నక్కా రాజశేఖర్ రిలయన్స్ మార్ట్‌కు స్టాక్ సరఫరా చేస్తుంటారు. అయితే రాజ మండ్రిలో ఉన్న రిలయన్స్ మార్ట్ నుంచి అనకాపల్లి పరిసర ప్రాంతాల్లో ఉన్న జియో మార్టులకు సరకు సరఫరా చేసేందుకు వ్యాన్‌ను విశాఖపట్నం పంపిం చారు. మూడు రోజులు గడచినా ఈ సరకు విశాఖపట్నానికి డెలివరీ కాకపోవడంతో జీపీఎస్ ట్రాక్‌గా వాహనాన్ని తాళ్లపాలెంలో ఉన్నట్టు గుర్తించారన్నారు. దీంతో ట్రావెల్స్ యజమాని పుల్లారెడ్డి గారి రమాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాళ్లపాలెం వద్ద నిలిపివేసి ఉన్న వ్యాన్‌ను స్వాధీనం చేసుకొని, మద్యం సేవించి ఉన్న డ్రైవర్ రాజశేఖర్‌ను అదుపులోకి తీసుకున్నా మని చెప్పారు. కాగా వ్యాన్‌లో రూ.5వేలు విలువ చేసే సరకు లేనట్టు గుర్తించా మన్నారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నా మని సీఐ వినోద్‌బాబు తెలిపారు.

ఒరిగిన భారీ ట్రాలీ

» రెండు పెద్ద క్రేన్‌ల సాయంతో బయటకు తీసిన వైనం

» రెండు కిలోమీటర్ల మేర నిలిచిపోయిన వాహనాలు



పక్కకు ఒరిగిపోయిన ట్రాలీ

ఎస్. రాయవరం, జూలై 25: నూతన భారీ వాహనాన్ని లోడ్ చేసుకొని అనకాపల్లి వైపు నుంచి తుని వైపు వెళుతున్న భా రీ ట్రాలీ లారీ గురువారం మండ లంలోని గోకులపాడు సమీపంలో కి వచ్చేసరికి రోడ్డు పక్కకు ఒరిగి పోయింది. అయితే ఈ లారీపై మరొక భారీ వాహనం ఉండడం తో అది ఎటూ కదలని పరిస్థితి నె లకొంది. దీంతో సమాచారం అం దుకున్న జాతీయ రహదారి సిబ్బంది ఈ వాహనాలను తీసేందుకు రెండు భా రీ క్రేన్‌లను రప్పించారు. ముందుగా ఉన్న నూతన వాహనాన్ని ట్రాలీ నుంచి దించిన తర్వాత ట్రాలీ లారీని బయటకు తీయించారు. తర్వాత ట్రాలీపై నూత న భారీ వాహనాన్ని ఎక్కించి పంపించారు. ఈ క్రమంలో సుమారు అర్థగంట సేపు పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో సుమారు రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. అనంతరం ట్రాఫిక్‌ను పోలీసులు క్లియర్ చేశారు.

రక్తహీనతతో గిరిజన మహిళ మృతి



సత్యవతి (ఫైల్)

గూడెంకొత్తవీధి, జూలై 25 : మండలంలోని గూడెం అద్దరవీధి గ్రామానికి చెందిన ఓ గిరిజన మహిళ రక్తహీనతతో మృతి చెందింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గూడెం అద్దరవీధికి చెం దిన చెక్క సత్యవతి (35) కొంత కాలంగా రక్తహీన తతో బాధపడుతున్నది. బుధవారం ఆమెకు ఛాతి నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు స్థానిక పీహె చ్‌సీకి తీసుకొచ్చారు. వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి కేజీహెచ్‌కు తరలించారు. బాధితురాలికి 6 గ్రాముల హెచ్‌బీ ఉండడంతో శుక్రవారం శస్త్రచికిత్స చేస్తామని కేజీహెచ్ వైద్యు లు తెలిపారు. అయితే ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించి గురువారం సా యంత్రం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది.

విధి నిర్వహణలో గుండె పోటుతో కండక్టర్ మృతి



పీవీఎస్ నారాయణ (ఫైల్ ఫొటో)

పాడేరురూరల్, జూలై 25 : అల్లూరి జిల్లా పాడేరు ప్రజా ట్రాన్స్‌పోర్టు డిపార్టుమెంట్ (ఆర్టీసీ)లో విధులు నిర్వహిస్తున్న కండక్టర్ పీవీఎస్ నారాయణ గురువారం విధి నిర్వాహణలో ఉండగా గుండెపోటుతో మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్.రాయవరం గ్రామానికి చెందిన నారా యణ గత రెండేళ్ళుగా పాడేరు డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం పాడేరు-అరకు ఉదయం 7.45 గంటల సర్వీస్‌లో విధులకు హాజరయ్యారు. బస్సు డుంబ్రిగుడ మండల కేంద్రం సమీపించే సరికి కండక్టర్ నారాయణకు గుండెలో నొప్పి రావ డంతో ఇబ్బందికి గురయ్యాడు. ఈ విషయాన్ని డ్రైవర్‌తో చెప్పడంతో డుంబ్రిగు డలో బస్సు నిలిపి కండక్టర్‌ను అక్కడ ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. మెరుగైన వైద్యం కోసం అరకు ఆస్పత్రికి తీసుకువెళ్లాలని అక్కడి వైద్యులు సూచించడంతో అక్కడ నుంచి కండక్టర్‌ను అదే బస్సులో అరకు ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యసేవలు పొందుతూ కండక్టర్ నారాయణ తుది శ్వాసవిడిచారు. ఈ విషయాన్ని తెలుసుకున్న డిపోమేనేజర్ వేదుల శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించి అరకు ఆస్పత్రికి చేరు కున్నారు. ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యు లకు అప్పగించి పీటీడీ బస్సులో స్వగ్రామానికి తరలించే ఏర్పాట్లు చేశారు. నారాయణకి డిపో అధికారులు, సిబ్బంది నివాళులు అర్పించారు.

'పేట' పీహెచ్‌సీ స్థలం హద్దులపై వివాదం

పాయకరావుపేట, జూలై 25 : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తమ స్థలం ఉందంటూ పక్క స్థల యజమాని సర్వే చేయించి హద్దులు ఏర్పాటుచేయ డంపై వివాదం తలెత్తింది. స్థానిక మెయిన్‌రోడ్డును ఆనుకుని వై. జంక్షన్ సమీపం లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చుట్టూ ప్రహరీ నిర్మాణం జరుగుతోంది. ఈ సమయంలో పక్క స్థల యజమాని ఆసుపత్రిలో తన స్థలం ఉందంటూ రెవెన్యూ అధికారులతో సర్వే చేయించి ప్రహరీ గోడ నుంచి 15 అడుగుల లోపలకు హద్దు లు ఏర్పాటుచేసి తాడు కట్టారు. దీనిపై పీహెచ్‌సీ వైద్యాధికారి తహసీల్దారుకు ఫి ర్యాదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక నాయకులు పక్క స్థల యజ మాని ఆసుపత్రి స్థలంలో తాడు ఏర్పాటుచేయడాన్ని గుర్తించి రెవెన్యూ అధికారుల ను నిలదీశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగతా శ్రీ నివాస్, సీపీఐ మండల కార్యదర్శి వెలుగుల అర్జునరావు, వికాస తరంగిణి సభ్యు లు చిక్కాల శ్రీనివాసరావు తదితరులు మాట్లాడుతూ దశాబ్దాల క్రితం ప్రహరీ గో డ కట్టిన సమయంలో అడ్డుకోని స్థల యజమాని ఇపుడు ఆసుపత్రిలో తన స్థలం ఉందంటూ హద్దులు ఏర్పాటుచేయడం ఏమిటని ప్రశ్నించారు. దీనివలన 200 గ జాల స్థలం ఆక్రమణ పాలవుతోందని ఆరోపించారు. ఇదిలా ఉంటే ఆసుపత్రి స్థల వివాదాన్ని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత దృష్టికి స్థానిక నాయకులు తీ సుకెళ్లారు. దీంతో రెవెన్యూ అధికారులు వెనక్కి తగ్గారు. ఈ సందర్భంగా తహసీ ల్దారు సూర్యనారాయణ మాట్లాడుతూ పీహెచ్‌సీ ప్రహరీ గోడ గతంలో ఉన్న చోటే కొత్తగా రక్షణ గోడ నిర్మాణం చేసుకోవచ్చని ఆదేశించామని తెలిపారు.

'అవినీతి అధికారుల నుంచి డీసీసీబీని కాపాడండి'

అనకాపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రుణాల మంజూరులో అక్రమాలకు పాల్పడిన అవినీతి అధికారుల నుంచి జిల్లా కేంద్ర సహకార కేంద్ర బ్యాంకును కాపాడాలని డీసీసీబీ మాజీ డైరెక్టరు గనగళ్ల వివేక్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 2017లో డీసీసీబీలో దాట్ల వెంకట సుబ్రహ్మణ్య వర్మ దొడ్డిదారిన బ్యాంకు సీఈఓగా బాధ్యతలు చేపట్టారని ఆరోపించారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	85.00
లైవ్ ధర	105.00
విత్ స్కిన్	180.00
స్కిన్ లెస్	190.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	485
విజయనగరం	489
శ్రీకాకుళం	489

అధ్వానంగా ఆర్టీసీ కాంప్లెక్స్

కనీస వసతులు కరువు

» డంపింగ్ యార్డును తలపిస్తున్న పరిసరాలు

» పట్టించుకోని అధికారులు



బురదనీరు దాటుకొని కాంప్లెక్స్‌కు వస్తున్న ప్రయాణికులు

చోడవరం, జూలై 25:

చోడవరం ఆర్టీసీ కాంప్లెక్స్ అధ్వానంగా ఉంది. కాంప్లెక్స్‌లోకి అడుగుపెట్టాలంటే బురదనీరు దాటాల్సిన పరిస్థితి నెలకొంది. కాంప్లెక్స్‌లో బస్సు కోసం వేచి ఉన్నంత సేపు పరిసరాల నుంచి వచ్చే దుర్గంధాన్ని భరించి కూర్చోకతప్పని దుస్థితి ఉంది.



ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాల్లోని వ్యర్థాలు

అటు అల్లూరి జిల్లా, ఇటు అనకాపల్లి జిల్లాలోని అనేక ప్రాంతాల నుంచి నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు చోడవరం ఆర్టీసీ కాంప్లె క్స్ మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. అటువంటి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సౌకర్యాలు, పరిశుభ్రతను అధికారులు పట్టించుకోవడం లేదు. ఇక కాంప్లె క్స్ పరిసరాల్లో చెత్తాచెదారం పారబోయడంతో ఆవరణ అంతా డంపింగ్ యార్డును తలపిస్తుంది. కాంప్లెక్స్‌కు ఆనుకుని ఉన్న చెరువులో వ్యర్థాలు పారబోయడంతో పాటు ఒక్కోసారి చెరువులో చనిపోయిన చేపలు కుళ్లి పోయి దుర్వాసన రావడంతో కాంప్లెక్స్‌లో బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు ముక్కుమూసుకుని కూర్చోవలసిన దుస్థితి నెలకొంది. ఆర్టీసీ కాంప్లెక్స్ బోర్డుతో పాటు, సన్‌షేడ్ మూడు నెలల క్రితం కూలిపో యింది. అయితే ఇప్పటి వరకు మళ్లీ బోర్డు ఏర్పాటు చేయాలన్నా ఆలోచనే అధికారులకు రాలేదు. కాగా కాంప్లెక్స్ ఆవరణలోని సులాభ్ కాంప్లెక్స్ టాయిలెట్ల ట్యాంకుల పైకప్పు లేచిపోవడంతో ఆ దుర్గంధం పరి సరాలలో వ్యాపిస్తున్నది. దుకాణాల అద్దెల రూపంలో ఆర్టీసీకి ఏటా లక్షలాది రూపాయల ఆదాయం వస్తున్నా కనీస వసతులు, పరిశుభ్రతను పాటించడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ప్రయాణికులు

పాఠశాల విద్యలో సమస్యలను పరిష్కరించాలి

» యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గౌంది చిన్నబ్బాయి



డీఈఓకు వినతిపత్రాన్ని అందిస్తున్న యూటీఎఫ్ నేతలు

అనకాపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యలో నెలకొన్న సమస్యలను పరి ష్కరించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గౌంది చిన్నబ్బాయి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం డీఈవో ఎంవీ లక్ష్మమ్మకు యూటీఎఫ్ జిల్లా నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం చిన్నబ్బాయి మాట్లా డుతూ గత ప్రభుత్వ హయాంలో విద్యారం గంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. జీఓ నంబరు 117ను రద్దు చేసి.. జీవో నంబరు 55 ప్రకారం టీచర్ల నియామకాలు జరపాల న్నారు. ఫ్రీప్రైమరీతో పాటు ఐదో తరగతి వరకు ఒకే పాఠశాలలో నడపాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే పరీక్షా విధానాన్ని అమలు చేయాలన్నారు. హైస్కూల్స్‌లో రెండు మీడియంలను సమాంతరంగా కొనసాగించా లని, ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి తప్పించాలని కోరారు. హైస్కూల్స్‌లో నాన్‌టీచింగ్ స్టాఫ్‌ను నియమించాలని కోరారు. మరో 20 కిపైగా ఇతరత్రా సమస్యలను పరి ష్కారం కోరుతూ వినతిపత్రం అందజేశామని తెలిపారు. డీఈఓను కలిసిన వారిలో యూటీఎఫ్ జిల్లా నాయకులు జీఎస్ ప్రకాశ్, ఎంవీ అప్పారావు, శంకర్, రాజునాయుడు, దేముడునాయుడు, బాబూరావు, ఆశ, తేజ్‌వర న్, శివయ్య రాజు తదితరులు పాల్గొన్నారు.

డొంకరాయి నీరు విడుదల

నీటి మట్టం 1,036 అడుగులకు చేరడంతో అప్రమత్తమైన జెన్‌కో అధికారులు

» ఒక గేటు ఎత్తి 2,173 క్యూసెక్కుల నీరు విడుదల



ఒక గేటు ఎత్తి 2173 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్న దృశ్యం

సీలేరు, జూలై 25: సీలేరు కాంప్లెక్సులోని డొంకరాయి జలా శయం నీటిని బుధవారం అర్ధరాత్రి జెన్‌కో అధికారులు విడుదల చేశారు. జలాశయంలోకి ఎనిమిది వేల క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వస్తున్నది. బుధవారం అర్ధరాత్రికి జలాశయంలో నీటి మట్టం 1036 అడుగులకు పెరగడంతో సీలేరు కాంప్లెక్సు ఎస్‌ఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఈఈ విజయ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో ఆరో నంబర్ గేటు రెండు అడుగుల ఎత్తి 2,173 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా డొంకరాయి ఈఈ విజయ్‌కు మార్ మాట్లాడుతూ జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 1,037 అడుగులు కాగా ఉన్నతాధికారుల నీటిని విడిచిపెట్టామన్నారు. ప్రస్తుతం ఇన్‌ఫ్లో 4వేలు నుంచి 4,500 క్యూసెక్కులు ఉందన్నారు. జలాశ యంలో 1035.50 అడుగుల వద్ద స్థిరంగా నీటి మట్టం కొనసాగేటట్టు చర్యలు చేపడుతున్నామన్నారు. అలాగే డొంకరాయి పవర్ కెనాల్‌కు 3 వేలు క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు.

ఐఐటీ, ఎన్‌ఐటీల స్థాయికి ఏయూ

... 5వ పేజీ తరువాయి

లేవు. క్వాలిటీ జర్నల్స్‌లో పబ్లికేషన్స్ లేకపోవడం కూడా ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్ పడిపోవడానికి కారణం. రీసెర్చ్ ప్రాజెక్టులకు దరఖాస్తు చేయాల్సిందిగా సీనియర్ ప్రొఫెసర్లను, ఫ్యాకల్టీని ప్రోత్సహిస్తున్నాం. ఫం డింగ్ చేసే సంస్థలకు దరఖాస్తు చేయాలని సూచించాం. దీనివల్ల వర్సి టీకి ఆదాయం లభించడంతోపాటు పీహెచ్‌డీలు అందించేందుకు అవకా శం ఏర్పడుతుంది.

తొలిసారి పెర్‌ఫార్మెన్స్ అప్రైజల్ ఫామ్

అంతర్జాతీయంగా పేరుగాంచిన వర్సిటీల్లో పెర్‌ఫార్మెన్స్ అప్రైజల్ ఫా మ్‌తో ఫ్యాకల్టీ ప్రతిభ, పరిశోధనలు, ఇతర అంశాలను అసెస్ చేస్తుంటా రు. తొలిసారి ఈ విధానాన్ని వర్సిటీలో ఈ ఏడాది నుంచి ప్రవేశపెడుతు న్నాం. విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పుడు వివిధ అంశాలతో కూడిన ఫామ్‌ను ఫ్యాకల్టీకి అందిస్తాం. ఇయర్ ఎండింగ్‌లో వాటిని తీసుకుం టాం. వీటిని చూడగానే సదరు ఫ్యాకల్టీకి సంబంధించిన పరిశోధన ప్రా జెక్టులు, ఇతర అంశాలపై అంచనాకు రావచ్చు. వీటిని హై లెవెల్‌లో ప రిశీలించే సిస్టమ్‌ను ఏర్పాటుచేస్తున్నాం. దీనివల్ల బోధనతోపాటు పరిశో ధనలోనూ నాణ్యత పెరుగుతుంది. ఇది ఎడ్యుకేషన్‌లో క్వాలిటీని పెంచేం దుకు దోహదపడుతుంది. ఇందులో సదరు ఫ్యాకల్టీ నమోదుచేసే పరిశో ధనకు సంబంధించిన అంశాలను గూగుల్ స్కాలర్ సైటేషన్ ఇండెక్స్ ఐ10 ఇండెక్స్, హెచ్ ఇండెక్స్‌లో ఆటోమేటిక్‌గా తెలుసుకునే వెసులుబా టు ఉంది. రీసెర్చ్, పబ్లికేషన్స్, ఫ్యాకల్టీ, అడ్మినిస్ట్రేషన్, ప్రాజెక్ట్, టీచింగ్‌పై ప్రధానంగా దృష్టిసారించి ముందుకువెళుతున్నాం.

ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్త కోర్సులు

ఈ విద్యా సంవత్సరం నుంచి ఐదు కొత్త కోర్సులు ప్రారంభించబోతు న్నాం. 500 సీట్లతో బీఈడీ ప్రారంభిస్తాం. ఇంకా ఎంబీఏలో హాస్పిటల్ మేనేజ్‌మెంట్, బీకాం కంప్యూటర్ సైన్స్, బీబీఏ, ఎమ్మెస్సీ జియో ఇన్ఫర్మే టిక్స్ కోర్సులు ప్రారంభిస్తున్నాం. రానున్న రోజుల్లో అవసరాలకు అనుగు ణంగా కోర్సులు ప్రారంభిస్తాం. వర్సిటీలో సమయపాలనకు ప్రాధాన్యం ఇవ్వాలని సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులకు స్పష్టమైన ఆదేశాలు జా రీచేశాం. వీసీలు వస్తుంటారు..వెళుతుంటారు. కానీ, వర్సిటీకి పేరుతెచ్చే విధానానికి మాత్రం అంతా బద్ధులై వ్యవహరించాలి. అప్పుడు వర్సిటీకి జాతీయస్థాయిలో పేరు వస్తుంది. విదేశీ విద్యార్థుల సంఖ్యను పెంచుకో వడంపై కూడా దృష్టిసారిస్తున్నాం.

వందేళ్ల వేడుకలు అదుర్స్ అనేలా నిర్వహణ

ఆంధ్ర యూనివర్సిటీ వచ్చే ఏడాది ఏప్రిల్ 26వ తేదీ వందో వసంతంలోకి అడుగుపెడుతోంది. 2026 ఏప్రిల్ 26 నాటికి వందేళ్లు పూ ర్తి చేసుకుంటుంది. ఏడాదిపాటు వందేళ్ల వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం, ఏ యూ పూర్వ విద్యార్థుల అసోసియేషన్ సహకారంతో అంగరంగ వైభవం గా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. జాతీయ, అంతర్జాతీయ సెమినార్లు, కాన్ఫరెన్స్‌లు, కల్చరల్ ఈవెంట్స్ వంటివి నిర్వహిస్తాం. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో వేడుకలకు ప్రధాని నరేంద్రమోదీని ఆ హ్వానించే ప్రణాళికలు ఉన్నాయి.

వీసీకి, ప్రిన్సిపాల్‌కు మధ్య ఉన్న బంధమే..

మాజీ వీసీ ప్రసాదరెడ్డికి, నాకు ఉన్న బంధం...ఒక ప్రిన్సిపాల్‌కు, వీసీ మధ్య ఉన్న బంధమే. అంతకుమించి అనుబంధం ఏమీ లేదు. నేను రా జకీయాలకు దూరంగా ఉండే వ్యక్తిని. యూనివర్సిటీ పాలనలోకి రాజకీ యాలను రానివ్వను. నన్ను నమ్మి ప్రభుత్వం ఈ బాధ్యతలను అప్పగిం చింది. ఇందుకు గవర్నర్ నజీర్, సీఎం చంద్రబాబునాయుడు, ఉప ము ఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు. ప్రభుత్వ నిర్ణయాలను అమలు చేయడం, యూనివర్సిటీని జాతీయ స్థాయిలో ముందంజలో నిలపడమే నా లక్ష్యం. గత వీసీ హయాంలో నిధులు దు ర్వినియోగం, ఇతర అంశాలు నా దృష్టికి ఏమీ రాలేదు. కొన్నిచోట్ల అవక తవకలు జరిగినట్టు ఫిర్యాదులు వచ్చాయి. వాటిని క్షుణ్ణంగా పరిశీలి స్తాం. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ముందుకువెళతాం. విచారణ కు ఆదేశిస్తే ఆ మేరకు వర్సిటీ నుంచి అవసరమైన సమాచారాన్ని అంది స్తాం. వీసీ పేషీతోపాటు కొన్ని సెక్షన్లలో పనిచేసే సిబ్బందిని మార్చాం. మిగిలిన వారిని కూడా మారుస్తాం. డీన్లు, ప్రిన్సిపాల్స్‌ను మార్చబోతు న్నాం.

యూజీసీ నిబంధనలు మేరకే నియామకాలు

గౌరవ ప్రొఫెసర్లకు వేతనాలు చెల్లించరు. వారు కొన్ని డిపార్టుమెంట్స్ లో మాత్రమే ఉన్నారు. యూనివర్సిటీ నుంచి రూపాయి కూడా చెల్లించే పరిస్థితి లేదు. యూజీసీ గైడ్‌లైన్స్ ప్రకారం ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీసెస్, అ డ్జంక్ట్ ప్రొఫెసర్లు వర్సిటీలోని మొత్తం ప్రొఫెసర్లలో పది శాతం మంది ఉండాలి. ఈ మేరకు యూజీసీ నిబంధనలు ఉన్నాయి. ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్ అంతా పరిశ్రమల నుంచి వచ్చిన వాళ్లే ఉండాలి. ఈ రెండు కేట గిరీలకు చెందిన వారికి రూ.80 వేలు మాత్రమే చెల్లిస్తాం. ఈ మేరకు యూజీసీ నిబంధనలు చెబుతున్నాయి. ఎన్ఆర్‌ఎఫ్ ర్యాంకింగ్‌లో వీటికి సంబంధించి కొన్ని పాయింట్లు కూడా పెట్టింది. కాబట్టి, వారిని తప్పనిస రిగా నియమించుకోవాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో అనేక వి భాగాల్లో ప్రొఫెసర్ల కొరత ఉంది. దాంతో బోధనపై ప్రభావం పడకుండా గౌరవ ప్రొఫెసర్‌లతోపాటు గెస్ట్ ఫ్యాకల్టీ సహాయంతో విభాగాలను నిర్వ హిస్తున్నాం. కొంతమంది గెస్ట్ ఫ్యాకల్టీని గతంలో తొలగించారు. వారిపై నిర్ణయం తీసుకుంటాం. అవసరమున్న విభాగాల్లో ఈ ఏడాదే తీసుకుం టాం. వచ్చే ఏడాది కొన్ని కోర్సులు ప్రారంభిస్తే...మిగిలిన వారిని తీసు కుంటాం. గెస్ట్ ఫ్యాకల్టీని తీసుకున్నప్పుడు కమిటీ వేసి..పారదర్శకంగా వ్యవహరిస్తాం. ఎయిడెడ్ కాలేజీల నుంచి వచ్చిన వారిపై ప్రస్తుతానికి ఎటువంటి నిర్ణయాన్ని తీసుకోలేను. వారికి ప్రభుత్వమే జీతాలు చెల్లి స్తోంది. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతాం. ప్రభుత్వ ఆదేశాల కు అనుగుణంగా చర్యలు తీసుకుంటాం. ఎయిడెడ్ ఫ్యాకల్టీలో కొందరికి హెచ్‌వోడీలుగా, డీన్లుగా అవకాశాలు ఇచ్చారు. అటువంటి వారిని తొల గించాం.

విద్యార్థుల ఇబ్బందులపై..

విద్యార్థులకు ఏవైనా ఇబ్బందులు ఉంటే నేరుగా నా దృష్టికి తీసుకురా వచ్చు. నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందిస్తున్నాం. హాస్టళ్లలో మెనూ అమలు చేస్తున్నారా?, లేదా..? అన్న దానిపై విద్యార్థులు ఫిర్యాదు చేయవచ్చు. క్వాలిటీ ఎలా ఉంటుందో పరిశీలించేందుకు రెండుసార్లు భో జనం చేశాను.

మూడు వేల ఎకో ఫ్రెండ్లీ మొక్కలు నాటే కార్యక్రమం

విద్యార్థులు వర్సిటీలో క్రమశిక్షణతో మెలిగేలా చర్యలు తీసుకుంటు న్నాం. గంజాయి, మత్తుమందులకు దూరంగా ఉండేలా చర్యలు తీసు కుంటున్నాం.

వర్సిటీలో 3000 ఎకో ఫ్రెండ్లీ మొక్కలను నాటబోతున్నాం. క్యాంపస్ మొత్తం గ్రీన్ బెల్ట్ అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. ఇందుకోసం పోర్టు కొన్ని మొక్కలను అందించింది. మేము కొన్ని కొనుగోలు చేశాం. కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్, పోలీస్ కమిషనర్, అటవీ శాఖ అధికారులు అను మతి, సహకారంతో క్యాంపస్‌లో నాటబోతున్నాం.



గెడ్డలో నిల్చొని నిరసన తెలుపుతున్న బొర్ర చింత గిరిజనులు

బొర్ర చింత గిరిజనుల నిరసన

» రహదారి సౌకర్యం కల్పించాలని డిమాండ్

దేవరాపల్లి, జూలై 25: మండలంలోని వాలాబు శివారు బొర్ర చింత గ్రామ గిరిజనులు గురువారం గెడ్డలో నిల్చొని నిరసన తెలిపారు. రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బి.టి.దొర, మత్సరాజు, రాములు, పైడి తల్లి, దేవరాజు భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నక్కపల్లి, జూలై 25: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవ త్సరానికి సంబంధించి, సింగిల్ మేజర్ బోటనీ సబ్జెక్టు బోధించేందుకు అర్హులైన అతి థి అధ్యాపక పోస్టుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శివ య్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్సీ బోటనీలో 55 శాతం మార్కు లు కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. ఎన్‌ఈటీ, సెట్, పీహెచ్‌డీ అభ్యర్థులకు ప్రా ధాన్యత వుంటుందని, ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పదేళ్ల తర్వాత ఎలమంచిలికి ఎక్స్‌ప్రెస్ బస్సులు

» కూటమి నేతల సంబరాలు



చంద్రబాబు, పవన్ కల్యాణ్, విజయకుమార్‌ల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కూటమి నేతలు

ఎలమంచిలి, జూలై 25: ఎట్టకేలకు ఎలమంచిలి బస్టాండ్‌కు ఎక్స్‌ప్రెస్ బస్సు లు పునరుద్ధరించడంతో కూటమి నేతలు సంబరాలు జరుపుకున్నారు. గురువారం ఉ దయం 9 గంటల సమయంలో కాకినాడ ఎక్స్‌ప్రెస్ బస్సు ఎలమంచిలి బస్టాండ్‌లోకి రావడంతో కూటమి నేతలు, కార్యకర్తలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. బస్సు డ్రైవర్, కండక్టర్లకు స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా బస్టాండ్‌లోని ప్రయాణికులకు స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం జనసేన పార్టీ ప ట్టణ అధ్యక్షుడు బొద్దపు శ్రీను మాట్లాడుతూ ఎలమంచిలి పట్టణంలోని బస్టాండ్‌కు పదేళ్ల తర్వాత ఎక్స్‌ప్రెస్ బస్సు వచ్చిందన్నారు. ఎమ్మెల్యే విజయకుమార్ ప్రత్యేక దృష్టి సారించడంతో ఎక్స్‌ప్రెస్ బస్సుల పునరుద్ధరణ జరిగిందన్నారు. టీడీపీ పట్టణ అధ్య క్షుడు గొర్లె నానాజీ, జనసేన జిల్లా కార్యదర్శి కొఠారు నరేష్ మాట్లాడుతూ ప్రజల స మస్యను గుర్తించి ఎక్స్‌ప్రెస్ బస్సులు పునరుద్ధరించడంలో ఎమ్మెల్యే చూపిన చొర వను ప్రజలు మరచిపోలేరన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు కొఠారు నరేష్, పల్లా సత్యనారాయణ, లంక రాజు, పల్లా సత్యనారాయణ, గుర్రాల శేఖర్, కొఠారు శ్రీ ను, చిట్టిబాబు, కరణం రవి, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

» డీఈవో వెంకటలక్ష్మమ్మ

లంకెలపాలెం, జూలై 25: విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లోనూ రాణించాలని జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం. వెంకటలక్ష్మమ్మ పిలుపునిచ్చారు. శిక్షా సప్తహ క్రీడా వారోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు పెదముషిడివాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుకే పరిమితం కాకుండా ఆటపాటల్లోనూ తమ ప్రతిభను చూపించాలన్నారు. ఈ కార్యక్ర మంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి మురళీపట్నాయక్, సర్వశిక్ష అభియాన్ ప్రతినిధి వెంకటేశ్వరరావు, హెచ్ఎం కృష్ణ, ఉపాధ్యాయ సిబ్బంది త దితరులు పాల్గొన్నారు.

'విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి'

తుమ్మపాల, జూలై 25 : విద్యారంగంలో నెలకొన్న సమస్యలను తక్షణమే ప రిష్కరించాలని పీడీఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. భాస్కర్ డిమాండ్ చేశారు. గురు వారం విద్యార్థులతో కలిసి ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేప ట్టారు. అనంతరం కార్యాలయ ఇన్‌చార్జి ఏఓ శ్రీనివాసరావుకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనకాపల్లిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. ఎస్సీ కాలేజి హాస్టల్‌కు కొత్త భవనాలు మంజూరు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ. 3,480 కోట్లు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులను విడుదల చేయాలన్నారు.

సబ్‌జైలును సందర్శించిన జడ్జి రమేశ్



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి రమేశ్


అనకాపల్లి టౌన్, జూలై 25: పాన్ ఇండియా ప్రోగ్రాంలో భాగంగా జిల్లా న్యాయ మూర్తి ఎన్. శ్రీవిద్య ఆదేశాల మేరకు అనకాపల్లి 11వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ రమేశ్ గురువారం స్థానిక సబ్ జైలును సందర్శించారు. ఖైదీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అవ సరమైన నిందితులకు ఉచిత న్యాయ సహాయ అవకాశం కల్పిస్తామని, దీనిని సద్విని యోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ గణే ష్‌రెడ్డి, న్యాయ సహాయకులు సాయిరాం, రోజా, తులసీ, ఎంఎల్‌ఎస్‌సీ ప్రతినిధి స త్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.











ఫిర్యాదుదారుల పట్ల జవాబుదారీతనం అవసరం

- పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ దీపిక సూచన

కొత్తూరు, జూలై 25 : ఫిర్యాదుదారుల పట్ల జవాబుదారీ తనం వహించాలని జిల్లా ఎస్పీ ఎం.దీపిక సూచించారు. గురువారం ఆమె అనకాపల్లి రూరల్ పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిర్యాదుదారుల సమస్యలపై సానుకూలంగా స్పందించాలన్నారు. చట్ట పరిధిలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాల బాలికలు, మహిళలపై జరిగే నేరాల పట్ల అప్రమత్తంగా వ్యవహరించి, సమగ్ర దర్యాప్తు చేయాలన్నారు. వీటిలో ఎటువంటి అలసత్వం వహించరాదని స్పష్టం చేశారు. దొంగతనాలు, చట్టవ్యతిరేక కార్యకలాపాలను నివారించేందుకు పగలు, రాత్రి గస్తీలను ముమ్మరం చేయాలని సూచించారు. గంజాయి అక్రమ రవాణా నియంత్రణకు రవాణా జరిగే మార్గాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఎస్‌ఐ తేజేశ్వరరావును ఆదేశించారు. తీవ్రమైన కేసుల సీడీ ఫైల్స్‌ను పరిశీలించి, ఆయా కేసుల పురోగతి తెలుసుకునేలా పలు సూచనలు చేశారు. ఆమె వెంట అనకాపల్లి డీఎస్పీ ఎస్.అప్పలరాజు, సీఐ ధనుంజయరావు ఉన్నారు.


అనకాపల్లి రూరల్ పోలీసు స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ దీపిక

ట్యాంకర్ నుంచి పెట్రోలు లీక్

- అధికారుల అప్రమత్తంతో తప్పిన ప్రమాదం

కశింకోట, జూలై 25 : ఇక్కడి పెట్రోలు బంకులో పార్కింగ్ చేసిన ట్యాంకర్‌కు రంధ్రం పడడంతో పెట్రోలు లీక్ అయిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఈ విషయాన్ని తెలుసుకున్న కశింకోట ఎస్సీ కాలనీకి చెందిన పలువురు తీవ్ర ఆందోళన చెందారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని హడలి పోయారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెనువెంటనే అక్కడకు చేరుకున్నారు. ట్యాంకర్‌కు చెందిన వివరాలు సేకరించి, అవసరమైన ప్రత్యామ్నాయ చర్యలను చేపట్టడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కాగా సంఘటనా స్థలాన్ని డీడీఆర్ ఎఫ్‌వో వెంకటరమణ పరిశీలించి, ఫైర్ సేఫ్టీ చర్యలను పరిశీలించారు.









వైసీపీ ఐదేళ్ల పాలనలో దళారులకే పెత్తనం

- 217 జీవో రద్దుతో మత్స్యకారులకు మేలు
- ఏపీ మత్స్యకార జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అమ్మోరియ్య

నక్కపల్లి, జూలై 25 : వైసీపీ ఐదేళ్ల పాలనలో అమలుచేసిన 217 జీవో కారణంగా మత్స్యకారుల ఉనికి తీవ్రంగా దెబ్బతిందని, 2800 మత్స్యకార సొసైటీలు రాష్ట్రవ్యాప్తంగా సంక్షోభంలో కూరుకుపోయాయని ఏపీ మత్స్యకార జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కంబాల అమ్మోరియ్య ఆరోపించారు. గురువారం నక్కపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ పాలనలో దళారులు పెత్తనం వల్ల మత్స్యకార సొసైటీలు, చిన్న తరహా మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్టు చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 217 జీవోను రద్దు చేయాలని సంకల్పించడం వల్ల మత్స్యకారుల ఉనికి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కాపాడినట్టవుతుందని అభిప్రాయపడ్డారు. అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయన వెంట ఆంధ్ర మత్స్యకార జేఏసీ ప్రతినిధులు పిక్కి కోదండరాం, వాసుపల్లి నూకరాజు, అప్పలరాజు, చేపల రాజు, గరికిన నూకరాజు, తదితరులు వున్నారు.


విలేకర్లతో మాట్లాడుతున్న జేఏసీ అధ్యక్షుడు అమ్మోరియ్య

విస్సన్నపేట భూములను సందర్శించిన కూటమి నేతలు

కశింకోట, జూలై 25 : మండలంలోని విస్సన్నపేట పంచాయతీలో వివాదాస్పద భూములను కూటమి నేతలు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ అక్రమంగా కప్పేసిన వాగులను, గెడ్డలను పరిశీలించారు. బయ్యవరం సర్వే నంబరు 195/2లోని 609 ఎకరాల్లో పచ్చని చెట్లను నిబంధనలకు వ్యతిరేకంగా నరికివేశారన్నారు. అంతేకాకుండా మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైసీపీ నాయకుడు బొడ్డేడ ప్రసాద్ అండదండలతో దళితులు సాగు చేసుకుంటున్న భూములను అన్యాయంగా లాక్కొని పచ్చని చెట్లను, కాలువలను, కొండలను ధ్వంసం చేశారని వారు ఆరోపించారు. వ్యవసాయ ఆధారిత భూములకు సాగునీరు వెళ్లకుండా రంగబోలు గెడ్డలను కూడా కప్పివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించి, బాధితులకు న్యాయం చేయాలని వారంతా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.


విస్సన్నపేట పంచాయతీలో భూములను పరిశీలిస్తున్న కూటమి నాయకులు

గ్రామాల్లో ఘనంగా అమ్మవార్ల పండగ


ఎం.జె.పురంలో పూజలు అందుకున్న మహాలక్ష్మి


కుమారపురంలో తలుపులమ్మకు పూజలు

అచ్యుతాపురం, జూలై 25 : మండలంలోని ఎం.జె.పురంలో మహాలక్ష్మి అమ్మవారి పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. సాయంత్రం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి.

పాయకరావుపేట రూరల్ : కుమారపురంలో తలుపులమ్మ పండగను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏటా ఆషాఢమాసంలో పౌర్ణమి తరువాత వచ్చే గురువారం ఈ వేడుకను జరుపుతుండడం ఆనవాయితీ. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో సందడి వాతావరణం నెలకొంది. గ్రామ పెద్దలు వెంకటరెడ్డి, బక్కిరెడ్డి, బాల కృష్ణారెడ్డి, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారతీయులంతా ఒక్కటే : డిప్యూటీ డీఈవో

పరవాడ, జూలై 25 : విద్యార్థులు సంస్కృతి, సంప్రదాయాలపట్ల అవగాహన ఏర్పరుచుకోవాలని డిప్యూటీ డీఈవో పి.అప్పారావు అన్నారు. శిక్షాసప్తాహ్ కార్యక్రమంలో భాగంగా గురువారం పరవాడ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సంస్కృతి దినోత్సవంలో మాట్లాడారు. వివిధ భాషలు, మతాలు, సంప్రదాయాలు, సంస్కృతి తెలిసిన భారతీయులందరూ ఒకటేనన్న విషయాన్ని గుర్తించాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. హెచ్‌ఎం బి.అప్పలనాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంఈవో సీకే దేవరాయలు అన్నారు. శిక్షా సప్తాహ్‌లో భాగంగా గురువారం మార్టూరు పాఠశాలలో నిర్వహించిన పోటీలు ప్రారంభించి మాట్లాడారు. హెచ్‌ఎం కె.మురళీకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోటవురట్ల : మండలంలోని పందూరు, కోటవురట్ల ఉన్నత పాఠశాలల్లో గురువారం బోధన అభ్యసన సామాగ్రి ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు డ్యాన్స్‌లతో అలరించారు. ఉపాధ్యాయులు ప్రమీళ, భాను, చంద్రశేఖర్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై ఏఈకి వినతి

ఎస్.రాయవరం, జూలై 25 : రేవుపోలవరం, కొత్త రేవుపోలవరం గ్రామాల్లో విద్యుత్ సమస్యలపై ఆయా గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, మాజీ సర్పంచ్‌లు కొవిరి బంగారి, చోడిపల్లి బంగారి తదితరుల ఆధ్వర్యంలో పలువురు గ్రామస్థులు కొరుప్రోలు విద్యుత్ కార్యాలయం వద్ద ఏఈ గోపికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా విధిస్తున్న కరెంట్ కోతలతో రెండు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. టీడీపీ గ్రామఅధ్యక్షుడు మైలపల్లి అప్పలరాజు, ఎరిపల్లి రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు అవసరం'

పాయకరావుపేట, జూలై 25 : విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని 13వ ఏపీ ఎన్‌సీసీ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ నీరజ్ కుమార్ అన్నారు. గురువారం స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో నిర్వహించిన స్కూల్ కెప్టెన్, హౌస్ కెప్టెన్ల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత రైతులను ఆదుకోవాలి

మునగపాక (తుమ్మపాల), జూలై 25 : గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని ముంపునకు గురైన పొలాల రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు కోరారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ పాపారావుకు నాయకులతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. రైతులు అప్పులు చేసి పంటలకు పెట్టుబడులు పెట్టారని, వర్షం వల్ల నష్టపోయారని ఆరోపించారు. సమగ్ర సర్వే చేసి నష్టపోయిన వారందరినీ ఆదుకోవాల్సిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.జోగినాయుడు, భీశెట్టి రాము తదితరులు పాల్గొన్నారు.

తెరువుపల్లిలో కబడ్డీ టోర్నీ ప్రారంభం

ఎలమంచిలి, జూలై 25 : మునిసిపాలిటీ పరిధి తెరువుపల్లి వార్డులో బురదాలమ్మ జాతర సందర్భంగా కబడ్డీ పోటీలను నిర్వహించారు. తొలుత పట్టణ ఎస్‌ఐ పాపినాయుడు, జనసేన పట్టణ అధ్యక్షుడు బొద్దపు శ్రీనులు పోటీలను ప్రారంభించారు. ఫ్లడ్‌లైట్ల వెలుతురులో ఎనిమిది జట్లు తలపడినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పల్లా సత్యనారాయణతో పాటు వార్డు పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం : సీపీఎం ఆందోళన

అనకాపల్లి టౌన్, జూలై 25 : కేంద్ర బడ్జెట్ ఆంధ్ర రాష్ట్రానికి, వెనుకబడిన ఉత్తరాంధ్రకు తీవ్ర అన్యాయం చేసేలా ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ఆరోపించారు. కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా ఆ పార్టీ నాయకులు గురువారం సాయంత్రం ఇక్కడి పీటీడీ కాంప్లెక్స్ జంక్షన్‌లో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ బడ్జెట్‌లో ప్రత్యేక హోదా ఊసే లేదని, రైల్వేజోన్, కడప ఉక్కు, మెట్రో, విద్య వైద్య సంస్థలు తదితర చట్టబద్ధమైన హామీలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు జి.కోటేశ్వరరావు, ఆర్. శంకరరావు, గంటా శ్రీరామ్, వీవీ శ్రీనివాసరావు, అల్లు రాజు, గనిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



అనకాపల్లిలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

అచ్యుతాపురం : ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న అంశాలను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని సీపీఎం మండల కన్వీనర్ రొంగలి రాము అన్నారు. గురువారం ఇక్కడ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో మాట్లాడారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరం వంటి ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు, విశాఖ రైల్వే జోన్, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ వంటి అంశాలను తుంగలో తొక్కిందన్నారు. రాంబిల్లి, నక్కపల్లి క్లస్టర్లలో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించలేదన్నారు. బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ కేంద్రంపై ఒత్తిడి తెచ్చి నిధులు రాబెట్టాలని కోరారు. అచ్యుతాపురం సెజ్‌లో ఈఎస్‌ఐ ఆసుపత్రిని నిర్మించాలన్నారు. పార్టీ రాంబిల్లి మండల కార్యదర్శి జి.దేముడు నాయుడు, నాయకులు చింతకాయల శివాజీ, కూండ్రపు సోమునాయుడు, నూకన్న, రాజా తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్, ఎస్పీలను కలిసిన బీజేపీ నాయకులు


కలెక్టర్ విజయకృష్ణన్‌కు బొకే అందిస్తున్న నాయకులు

అనకాపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి జగదీశ్వరరావు, పలువురు నాయకులు కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ ఎం.దీపికలను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి బొకేలను అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పి.అప్పారావు, బీవీఎస్ వర్మ, పి.ప్రసాద్, కొండబాబు, నాగేశ్వరరావు, సత్యనారాయణ, నాగమణి, సంతోషి కుమారి, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్ దృష్టికి వైసీపీ నేతల భూదందా

అనకాపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : అమరావతి లోని శాసన సభ లాబీయింగ్ హాలులో గురువారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్‌ను అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి అనకాపల్లిలో గత వైసీపీ ప్రభుత్వం చేసిన భూదందాలు, అవి నీతి అక్రమాలపై సమగ్ర నివేదికను ఆయన అందజేశారు. గత ప్రభుత్వ అక్రమాలపై విచారణ జరిపించాలని కోరారు.


లోకేశ్‌ను కలిసి పీలా గోవింద

'చేపల వేట నిషేధ సహాయం అందించాలి'

అచ్యుతాపురం, జూలై 25 : వేట నిషేధ సమయంలో ప్రభుత్వం మత్స్యకారులకు సహాయంగా ప్రకటించిన రూ.20 వేలను వెంటనే అందించాలని మత్స్యకార్మిక సంఘం ఆధ్వర్యంలో మత్స్యకారులు గురువారం స్థానిక మత్స్య అభివృద్ధి అధికారి రవితేజకు వినతి పత్రాన్ని అందజేశారు. అలాగే తుఫాన్ కారణంగా గత వారం రోజుల నుంచి మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వీరికి నిత్యావసర సరకులు అందజేయాలని కోరారు. మత్స్యకార సంఘం నాయకులు ఆర్.రాము, జి.దేవుడునాయుడు, చేపల తాతయ్య, చెల్లూరి నూకన్న, మైలపల్లి రమణ, కూండ్రపు సోమునాయుడు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

సబ్బవరం, జూలై 25 : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి అన్నారు. గురువారం కళాశాల ఆవరణలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఆమె పలు మొక్కలను నాటి మాట్లాడారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శంకర్, డాక్టర్ నివేదితా, డాక్టర్ ఎంవీ రామకృష్ణ, ఎన్‌ఎస్‌ఎస్ పీవో ఎల్ గణేష్ పాల్గొన్నారు.

పరిశ్రమల్లో ప్రమాదాలపై విచారణ చేపట్టాలి

తుమ్మపాల, జూలై 25 : జిల్లాలో గల ఎస్ఈజెడ్, ఫార్మాసిటీ పరిశ్రమల్లో తరుచూ జరుగుతున్న ప్రమాదాలపై తక్షణమే విచారణ చేపట్టాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ కార్యాలయంలో జరిగిన ఏఐటీయూసీ నాయకుల సమావేశంలో మాట్లాడారు. పరిశ్రమల్లో నిత్యం ప్రమాదాలు జరుగుతూ కార్మికుల ప్రాణాలు కోల్పోతున్నా ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పరిశ్రమల్లో కార్మికులకు కనీస భద్రత కరువైందని ఆరోపించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కె.త్రినాథ్, నాయకులు విత్తనాల పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

'ఉద్యోగులపై కేసుల ఎత్తివేత నిర్ణయం గొప్పది'

తుమ్మపాల, జూలై 25 : గత రెండు సంవత్సరాలుగా సీపీఎస్ ఉద్యోగులపై నమోదైన కేసులను ఎత్తివేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించడం హర్షణీయమని ఏపీ సీపీఎస్‌ఈఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఉమామహేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో అక్రమ కేసులు కారణంగా సీపీఎస్ ఉద్యోగులు మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆయన వాపోయారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో నాలుగు లక్షల మంది సీపీఎస్ ఉద్యోగులకు ప్రశాంతత లభిస్తుందని ఆనందం వ్యక్తం చేశారు.

నేవల్ బేస్ నిర్వాసితుల సమస్యలపై వినతి

రాంబిల్లి, జూలై 25 : నేవల్ బేస్ నిర్వాసితులకు పెండింగ్ ప్యాకేజీ వెంటనే ఇవ్వాలని కోరుతూ గురువారం ఎన్ఏవోబీ డిప్యూటీ కలెక్టర్ మనోరమకు సీపీఎం నాయకులు జి.దేముడునాయుడు తదితరులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాకయులు చింతకాయల శివాజీ, చెల్లూరి నూకన్న తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు అండగా హెరిటేజ్ డెయిరీ

మునగపాక (తుమ్మపాల), జూలై 25 : పాడి రైతులకు హెరిటేజ్ డెయిరీ నిత్యం అండగా నిలుస్తోందని డెయిరీ జోనల్ మేనేజర్ వి.దివాకర్ అన్నారు. మండలంలోని గంగాదేవిపేటలో గురువారం పాడి రైతులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. పాడి పశువులకు కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్‌ను రూ.50, ఆడదూడ పుట్టేందుకు రూ.500లకే అందిస్తున్నట్టు చెప్పారు. ఇతర డెయిరీల కంటే హెరిటేజ్ డెయిరీ పాడి రైతులకు పాల ధరను అధికంగా అందిస్తున్నట్టు వివరించారు. డెయిరీ ప్రతినిధులు కూండ్రపు శేషు, సీహెచ్.రాము, బొడ్డేటి నరేశ్, మొల్లేటి జగ్గలక్ష్మి పాల్గొన్నారు.



నర్సీపట్నం నియోజకవర్గం

దుర్గాదేవికి సారె సమర్పణ



సారె తీసుకెళుతున్న మహిళలు

గొలుగొండ, జూలై 25 : గొలుగొండలో గురువారం దుర్గాదేవికి సమరసత సేవా ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో సారె సమర్పణ నిర్వహించారు. తొలుత కేజీబీవీ పాఠశాల నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకూ సారె భారీ ఊరేగింపుతో సాగింది. బీసీ హాస్టల్ వద్ద గల దుర్గాదేవి అమ్మవారి ఆలయానికి చేరుకుని అమ్మవారికి భక్తులు సారె సమర్పించారు. ఆషాడమాసం సందర్భంగా ఈ కార్యమం చేపట్టినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గొలుగొండకు చెందిన భక్తులు, బంగారుబాబు, తదితరులు పాల్గొన్నారు.

27న మండల సర్వసభ్య సమావేశం

మాకవరపాలెం, జూలై 25 : ఈ నెల 27న (శనివారం) మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో చంద్రరావు తెలిపారు. ఎంపీపీ సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావలని, అలాగే మండల స్థాయి అధికారులంతా పూర్తి సమాచారంతో రావాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నర్సీపట్నం, జూలై 25 : బలిఘట్టం సబ్ స్టేషన్ పరిధిలో లైన్, సబ్ స్టేషన్ మరమ్మతులు, జంగిల్ క్లీరెన్స్ పనులు చేపడుతున్నందున బలిఘట్టం, బయపురెడ్డిపాలెం ప్రాంతాలలో శుక్రవారం ఉదయం 8 గంటలు నుంచి మధ్యాహ్నం 2 గంటలు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఈపీడీసీఎల్ డీఈఈ వీడీవీ రామకృష్ణ పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మాకవరపాలెం : మండలంలో కన్నూరిపాలెం 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ డీఈ నాగభూషణ్‌రావు తెలిపారు. సబ్‌స్టేషన్ మరమ్మత్తుల నిమిత్తం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. రామన్నపాలెం, శెట్టిపాలెం, భీమబోయినపాలెం, చింతలూరు, వెంకన్నపాలెం, జెడ్.గంగవరం, వెంకయ్యపాలెం, చినరాచపల్లి, దుంగలవానిపాలెం,సుబ్బయ్యపాలెం ఎరకన్నపాలెం, జి.వెంకటాపురం గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

వ్యవసాయ పనుల్లో రైతులు బిజీ

▸▸ వర్షాలు ఆశాజనకంగా ఉండడంతో కర్షకుల్లో ఆనందం



ట్రాక్టర్‌తో దమ్ము పనులు చేస్తున్న రైతులు

నాతవరం, జూలై 25 : గత వారం రోజుల నుంచి వర్షాలు పడుతుండటంతో రైతులు ట్రాక్టర్లు, నాగళ్లతో దమ్ములు చేస్తూ వ్యవసాయ పనులలో బిజీబిజీగా గడుపుతున్నారు. నాతవరం దాలమ్మ చెరువు పూర్తిస్థాయిలో నిండటంతో ఇప్పటికే వరినారు సిద్ధం చేసుకున్న రైతులు పొలాలను దమ్ముపట్టి వరినాట్లు వేయడానికి సిద్ధమవుతున్నారు. అలాగే మెట్టప్రాంతాల రైతులు వరినారు వేసినా ఇంకా ఎదగటానికి సమయం ఉండటంతో తాండవ రిజర్వాయర్ నీరు విడుదల చేసినప్పుడు వరినాట్లు వేయడానికి ఎదురుచూస్తున్నారు. వ్యవసాయ కూలీలకు పారపనులు, తుప్పలు కొట్టడం వంటి పనులు దొరకటంతో వీరికి చేతి నిండా పనులు దొరుకుతున్నాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే అన్ని రైతుభరోసా కేంద్రాలోనూ దమ్ము పట్టిన వెంటనే పొలాల్లో వేయడానికి అవసరమైన డీఏపీ ఎరువులను సిద్ధంగా ఉంచాలని రైతులు కోరుతున్నారు.

గ్రామాల్లో పారిశుధ్య చర్యలు

ఎంపీడీవో రత్నకుమారి



చెత్తసంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

కృష్ణాదేవిపేట, జూలై 25 : గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని గొలుగొండ ఎంపీడీవో రత్నకుమారి ఆదేశించారు. గురువారం మండలంలో పాతకృష్ణాదేవిపేట, ఏఎల్‌పురం తదితర గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను తనిఖీలు చేశారు. అనంతరం చెత్తసంపద కేంద్రాలు సందర్శించి అక్కడ తయారయ్యే ఎరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రత్నకుమారి మాట్లాడుతూ గ్రామాల్లో వర్షాకాల ప్రభావంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రత్యేక పారిశుధ్యపనులు చేయిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆరోగ్యంసూత్రాలు పాటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లోచల సుజాత, ఈవోపీఆర్‌డీ రమణి, కార్యదర్శులు కిరణ్మయి, శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ

నర్సీపట్నం, జూలై 25 : శిక్షా సప్తహ్‌లో భాగంగా గబ్బాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కంప్యూటర్ విద్య బోధన నిమిత్తం ఎస్‌బీఐ ప్రధాన బ్రాంచ్ మేనేజర్ జేవీ రాఘవరావు డెస్క్‌టాప్ కంప్యూటర్ అందజేశారు. గురువారం పాఠశాల హెచ్‌ఎం సి.సత్యనారాయణ (కిట్టు మాస్టార్)కు అందజేశారు. గబ్బాడ సర్పంచ్ ఈర్లి రాజేశ్వరి, ఎంపీటీసీ మాజీ సభ్యుడురాజుబాబు పాల్గొన్నారు.

ఇసుక, కాంక్రీట్ పిక్క కొరత సమస్యను పరిష్కరించాలి



ధర్నా నిర్వహిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

నర్సీపట్నం, జూలై 25 : ఇసుక, కాంక్రీట్ పిక్క కొరత సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భవన నిర్మాణ కార్మికుల సంఘం ప్రతినిధులు సీఐటీయూ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ధర్నా చేశారు. అనంతరం ఆర్డీవో హెచ్‌వీ జయరాంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ గబ్బాడ ఇసుక డిపోలో జరిగిన అవకతవకలపై విచారణ చేసే వరకు సరఫరా ఆపాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశాలు ఇచ్చినప్పటికీ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ఇసుక సరఫరా ఆగిపోయి నిర్మాణ పనులు మందగించాయని అన్నారు. ఇసుక, కాంక్రీట్ పిక్క కొరత కారణంగా భవన నిర్మాణదారులు పనులు ఆపేయడంతో కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అధికారులు తక్షణ చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించాలని కోరారు.

తాగునీటి సమస్య ప్రాంతాల్లో 'నాసా' ఆధ్వర్యంలో చేతి బోర్లు



చేతి బోరు ప్రారంభిస్తున్న షేబా

నాతవరం, జూలై 25 : ఆదివాసీ గ్రామాల్లో తాగునీటి సమస్య ఉన్నచోట గిరిజనులు ఇబ్బంది పడకుండా చేతిబోర్లు ఏర్పాటు చేస్తున్నట్టు నాసాసంస్థ డెరెక్టర్ షేబా తెలిపారు. గురువారం నాతవరం మండలం వెదురుపల్లి పంచాయతీ కొడవటిపూడి అగ్రహారం, డి.యర్రవరం పంచాయతీ ఎరకంపేటలో నాసాసంస్థ ఏర్పాటు చేసిన చేతిబోర్లను ఆయన స్థానిక నాయకులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా షేబా మాట్లాడుతూ గత కొన్నేళ్ళ నుంచి నీటి సమస్య ఉన్న చోట్ల తాము చేతిబోర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాసా సంస్థ కో-ఆర్డినేటర్ టి. శ్రీను, కొంద్రు మరిడియ్య, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

తూటిపాల పాఠశాలలో శుభదిన్ భోజనం



మాకవరపాలెం, జూలై 25 : మండలంలో తూటిపాల పాఠశాలలో తిథి భోజన్ (శుభదిన్ భోజనం) కార్యక్రమాన్ని నిర్వహించినట్లు హెచ్‌ఎం కోసూరు రాము తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడవ రోజు శిక్షా సప్తాహ్‌లో భాగంగా గురువారం పీఎం పోషన్ మధ్యాహ్న భోజన పథకం నిర్వహించినట్లు చెప్పారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శిక్షా సప్తాహ్‌లో సాంస్కృతిక దినోత్సవం



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎంఈవో మూర్తి

మాకవరపాలెం, జూలై 25 : మాకవరపాలెం హైస్కూల్‌లో గురువారం సాంస్కృతిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మూర్తి మాట్లాడుతూ శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా నాలుగో రోజు పలు పాఠశాలలో విద్యార్థులకు బాషలు వారి ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలను గౌరవించేలా కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ క్రమంలో ఏక్ భారత్ శ్రేష్ట భారత్ అనే కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. పలువురు జాతీయ నాయకుల వేషధారణలో పిల్లల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఉత్తమ శాస్త్రీయ నృత్య ప్రదర్శనలో పదవ తరగతి విద్యార్థి భవ్యకు మొదటి బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అచ్చుత్‌రామయ్య, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఒలింపిక్స్‌లో విజయాన్ని కాంక్షిస్తూ సంతకాలు



బెస్ట్ ఆఫ్ లక్ చెబుతున్న విద్యార్థినులు



సంతకం చేస్తున్న ఎంఈవో

నర్సీపట్నం, జూలై 25 : భారతదేశం తరపున ఒలింపిక్స్‌లో పాల్గొననున్న క్రీడాకారులకు అభినందనలు తెలియజేస్తూ శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి దమయంతి ఆధ్వర్యంలో సంతకాలు సేకరణ చేపట్టారు. 'బెస్ట్ ఆఫ్ లక్ ఇండియా' పేరుతో చేపట్టిన ఈ కార్యక్రమంలో పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రముఖులు సంతకాలు చేసి క్రీడాకారులు పతకాలు సాధించాలని కోరుతూ సందేశాన్ని పంపారు. అసెంబ్లీ సమావేశాల కారణంగా కార్యక్రమానికి రాలేకపోతున్నానని శాసన సభాపతి అయ్యన్నపాత్రుడు నిర్వహకులకు తెలిపి ఒలింపిక్ క్రీడాకారులకు అభినందనలు తెలుపుతూ తొలి సంతకం చేసిన లేఖను శాఖా గ్రంథాలయాధికారికి పంపించారు. జాతీయ సివిల్ సర్వీసెస్ గేమ్స్‌లో పతకం సాధించిన వ్యాయామ ఉపాధ్యాయిని శ్రీదేవిని సన్మానించారు. ఎంఈవో-2 నాగేంద్ర, నాతవరం ఎంఈవో వరహాలబాబు, పట్టణ ఎస్సై సుధాకరరావు, విశ్రాంత గ్రంథాలయ అధికారి మురళి, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు కె.ప్రభాకర్, త్రిమూర్తులురెడ్డి పాల్గొన్నారు.

మితిమీరుతున్న ఆకతాయిల ఆగడాలు

నర్సీపట్నం, జూలై 25 : ఆర్టీసీ బస్టాండ్‌లో విద్యార్థులు ముసుగులో ఆకతాయిల ఆగడాలు ఎక్కువయ్యాయని పట్టణ పోలీసులకు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గీతాకృష్ణ గురువారం ఫిర్యాదు చేశారు. ఉదయం, సాయంత్రం అల్లరి మూకలు కారణంగా విద్యార్థినులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. సాయంత్రం 4.30 నుంచి 6 గంటలు వరకు సమస్య అధికంగా ఉందని పేర్కొన్నారు.

చోడవరం నియోజకవర్గం

లక్ష్మీపురంలో విత్తన ఉత్పత్తి కార్యక్రమం



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు

చోడవరం, జూలై 25 : లక్ష్మీపురంలో గురువారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో విత్తన ఉత్పత్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు మాట్లాడారు. రైతులు విత్తనాలు ఉత్పత్తి చేస్తే వాటిని తిరిగి ప్రభుత్వానికి విక్రయించడం ద్వారా ఆదాయం లభించే అవకాశం ఉందన్నారు. దీనిని రైతులు వినియోగించుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవోలు పావని, విజేత, విస్తరణాధికారి త్రివిక్రమ్ స్థానిక రైతులు పాల్గొన్నారు.

29న చోడవరంలో నేత్ర వైద్యశిబిరం

చోడవరం, జూలై 25 : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 29న పట్టణంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు లయన్స్ క్లబ్ ప్రతినిధి వాణిబాబు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

తాచేరు డైవర్షన్ రోడ్డుపై రవాణా ప్రారంభం

బుచ్చెయ్యపేట, జూలై 25 : భీమునిపట్నం- నర్సీపట్నం(బీఎన్) రోడ్డులో తాచేరు డైవర్షన్ రోడ్డు రవాణాను గురువారం అధికారులు పునరుద్ధరించారు. భారీ వర్షాల కారణంగా ఈ నెల 20వ తేదీన డైవర్షన్ రోడ్డు గండి పడడంతో రవాణాను నిలిపివేసిన విషయం తెలిసిందే. ఆర్అండ్‌బీ ఇంజనీరింగ్ అధికారులు దెబ్బతిన్న డైవర్షన్ రోడ్డుపై తాత్కలికంగా మరమ్మతులు చేపట్టడంతో రవాణాను పునరుద్ధరించారు. ముందుగా ఆటోలు, వ్యాన్‌లు, స్కూల్ బస్సులు, ట్రాక్టర్లు, బైక్‌లను అనుమతించారు. ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలను అనుమతించ లేదు.

జాజులపాలెంలో ప్రత్యేక వైద్య శిబిరం

▸▸ జ్వరంతో గిరిజన బాలుడు మృతిపై స్పందించిన జిల్లా ఉన్నతాధికారులు ▸▸ ఇంటింటికీ వెళ్లి పరీక్షలు



జాజులపాలెంలో వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్న వైద్యులు

చీడికాడ, జూలై 25 : మండలంలోని కోనాం శివారు జాజులపాలెం గిరిజన గ్రామంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ గ్రామంలో జ్వరంతో గిరిజన బాలుడు మృతి చెందిన విషయం గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితం కావడంతో జిల్లా ఉన్నతాధికారులు వెనువెంటనే స్పందించారు. ఈ మేరకు ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా మలేరియా ఆఫీసర్ కె.వరహాలుదొర, సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటరావు, ఆరోగ్యశ్రీ జిల్లా కన్వీనర్ రంజిత్, వైద్యాధికారి డాక్టర్ సునీల్‌కుమార్ తదితరులు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి 84మందికి తనిఖీలు చేపట్టారు. వీరిలో ఇద్దరికి జ్వరాలు ఉన్నట్టు గుర్తించారు. ఈ సందర్భంగా డీఎంవో వరహాలుదొర గ్రామస్థులకు ఆరోగ్య పరిరక్షణపై పలు సూచనలు చేశారు. హెల్త్ అసిస్టెంట్ పేరునాయుడు, సూపర్‌వైజర్ జి.వెంక టరావు, ఏఎన్ఎం రాజేశ్వరి, ఉపాధ్యాయులు భానుప్రసాద్, ఎ.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలం పూర్తయ్యే వరకు గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు : డీఎంహెచ్‌వో



వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ బాలాజీ

చీడికాడ పీహెచ్‌సీ పరిధిలోని గిరిజన గ్రామాల్లో వర్షాకాలం పూర్తయ్యేవరకూ ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ బాలాజీ వైద్య సిబ్బందిని ఆదేశించారు. గురువారం జాజులపాలెంలో జరుగుతున్న వైద్య శిబిరాన్ని ఆయన తనిఖీచేసిన అనంతరం వైద్యం, పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు అందించారు. గ్రామాల్లో ఈ మలేరియా, ఫైలేరియా, అంటువ్యాధులు వంటివి సోకకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఏ ఒక్కరికీ జ్వరం వచ్చిన వెంటనే స్పందించి ప్రభుత్వ ఆస్పత్రికి పంపించాలని ఆదేశించారు. జాజులపాలెం గ్రామానికి చెందిన ఐదు నెలలు నిండిన గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చీడికాడ వైద్యాధికారి సునీల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి సన్యాసిరావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొత్తూరు జంక్షన్‌లో గుంతలు పూడ్చివేత



చోడవరం, జూలై 25 : పట్టణంలోని ప్రధాన బీఎన్ రోడ్డులో గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని చేపట్టారు. 'రహదారులు ఛిద్రం.. ప్రయాణం దుర్లభం' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో గురువారం ప్రచురితమైన కథనానికి ఆర్అండ్‌బీ అధికారులు వెంటనే స్పందించారు. కొత్తూరు జంక్షన్ సమీపంలోని ప్రధాన రహదారిపై నీరు నిల్వ ఉండిపోయిన గుంతను క్రషర్ బుగ్గి వేసి పూడ్చి, వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు.

బదిలీపై వెళుతున్న తహసీల్దార్‌కు సన్మానం



శ్రీకాంత్‌కు జ్ఞాపిక అందిస్తున్న సిబ్బంది

బుచ్చెయ్యపేట, జూలై 25 : సార్వత్రిక ఎన్నికల ముందు ఇక్కడికి విచ్చేసిన తహసీల్దార్ శ్రీకాంత్‌కు బదిలీ అయిన సందర్భంగా గురువారం రెవెన్యూ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. విజయనగం జిల్లా నుంచి వచ్చిన శ్రీకాంత్ తహసీల్దార్‌గా, నియోజకవర్గ ఆర్‌వోగా సమర్థవంతమైన సేవలందించారని హెచ్‌డీటీ అరుణ్‌చంద్ర ప్రశంసించారు. ఎంపీడీవో వెంకటాచార్యులు, ఈవోపీఆర్‌డీ విజయలక్ష్మి, ఎస్ఐ డి.ఈశ్వరరావు, ఆర్ఐలు, వీఆర్వోలు, బిఎల్‌వోలు పాల్గొన్నారు

ఘనంగా మరిడిమాంబ పండగ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

బుచ్చెయ్యపేట, జూలై 25 : వడ్డాదిలో గురువారం మరిడిమాంబ పండగను ఘనంగా నిర్వహించారు. ఎద్దఎత్తున భక్తులు మేళతాళాలు, బాజా భజంత్రీలతో అమ్మవారికి ఘటాలను ఊరేగింపుగా తీసుకెళ్లి సమర్పించారు. వడ్డాది పట్టణ టీడీపీ అధ్యక్షుడు దొండా నరేష్, పార్టీ నాయకులు తలారి శంకరరావు, అద్రటావు ఈశ్వరరావు, దొండా రమేష్, రాజేష్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆకట్టుకున్న విద్యార్థినుల నృత్యాలు



రోలుగుంట పాఠశాలలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

రోలుగుంట, జూలై 25 : శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా రోలుగుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఆంగ్ల ఉపాధ్యాయిని నాగేశ్వరి ఆధ్వర్యంలో విద్యార్థినులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. హెచ్‌ఎం డీఎస్ఎస్‌వీప్రసాద్, ఉపాధ్యాయులు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బుచ్చెయ్యపేట, జూలై 25 : మెయింటెనెన్స్ పనుల కారణంగా శుక్రవారం వడ్డాది సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఏఈఈ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. బంగారుమెట్ట నుంచి కోమళ్లపూడి, పొలేపల్లి, రాజాం సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 2.30 వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

'ఫిజియోథెరపీతో సత్ఫలితాలు'



ఫిజియోథెరపీ సేవలు ప్రారంభిస్తున్న ఎంఈవో తలుపులు

రావికమతం, జూలై 25 : దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ చేయడం ద్వారా సతలితాలు సాధించవచ్చునని ఎంఈవో తలుపులు అన్నారు. ఇక్కడి భవిత కేంద్రంలో నూతనంగా నియమితులైన ఫిజియోథెరపిస్ట్ లావాణ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఫిజియోథెరపీ సేవలను ప్రారంభించి మాట్లాడారు. ప్రత్యేక ఉపాధ్యాయులు జగన్నాథనాయుడు, మహా లక్ష్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఆధార్ సేవలు



ఆధార్‌సేవా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీవో

చీడికాడ, జూలై 25 : ప్రతిరోజూ యాభై మందికి తగ్గకుండా ఆధార్ నమోదు చేయాని ఎంపీడీవో ఉమామహేశ్వరి సిబ్బందికి ఆదేశించారు. జి.కొత్తపల్లి ఆధార్ సేవా కేంద్రాన్ని గురువారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులందరికీ ఈ సేవలు అందాలన్నారు. సర్పంచ్ కొల్లి సూరినాయుడు, పంచాయతీ కార్యదర్శి పట్నాల గోపి, ఏపీఎం చీకటి శ్రీనివాస్, వీఆర్‌వో రెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

కె.కోటపాడు, జూలై 25 : ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ తరణి అన్నారు. సూరెడ్డిపాలెంలో స్టాప్ డయేరియా, డెంగ్యూ, మలేరియాపై గురువారం ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. హెల్త్ అసిస్టెంట్ డీఎస్ఎన్ రాజు, ఎంఎల్‌హెచ్‌పీ హేమ, ఏఎన్ఎం దేవి తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల నియోజకవర్గం

అంగన్‌వాడీ భవన నిర్మాణానికి నిధులు



చెరుకుపల్లిలో అసంపూర్తి భవనాన్ని పరిశీలిస్తున్న నాబార్డు జిల్లా మేనేజర్ సుమిత్‌కుమార్

చీడికాడ, జూలై 25 : చెరుకుపల్లిలో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవన నిర్మాణం పూర్తి చేసేందుకు అదనపు నిధుల కోసం ప్రభుత్వానికి నివేదిస్తానని నాబార్డు జిల్లా మేనేజర్ జి.డి.సుమిత్‌కుమార్ తెలిపారు. కోనాం శివారు చెరుకుపల్లి గిరిజన గ్రామంలో అసంపూర్తిగా ఉన్న సదరు భవనాన్ని మాడుగుల ఐసీడీఎస్ పీవో సిహెచ్.శ్రీదేవితో కలిసి గురువారం పరిశీలించి మాట్లాడారు. అనంతరం కోనాంలో ఉన్న అంగన్‌వాడీ-2 కేంద్రాన్ని తనిఖీ చేశారు. సూపర్‌వైజర్ పి.చిన్నమ్మలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై పంచాయతీ ప్రత్యేక దృష్టి



పొంగలిపాకలో జంగిల్ క్లియరెన్స్ చేస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్, జూలై 25 : పొంగలిపాకలో గురువారం పారిశుధ్య పనులు చేపట్టారు. స్థానిక నాయకులు నాయని సత్యనారాయణ, ఉండూరు దేముడు, భాస్కరరావు, కుమారు, నాగు యువకుల సహకారంతో రోడ్డుకిరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేయించారు. పంచాయతీ పారిశుధ్య సిబ్బంది కాలువల్లో చెత్తాచెదారాన్ని తొలగించారు. కార్యదర్శి పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌సీఎం స్కూల్ సిస్టర్ ట్రీసాన్ మృతి

మాడుగుల, జూలై 25 : పట్టణంలోని ఆర్‌సీఎం స్కూల్‌లో హెచ్‌ఎంగా పనిచేసి, ఎంతోమంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దిన సిస్టర్ ట్రీసాన్ గురువారం ఉదయం గాజువాక సమీపం మల్కాపురంలో మృతిచెందారు. ఈమె మాడుగుల ఆర్‌సీఎంలో గణితం, ఇంగ్లీష్ టీచర్‌గా పనిచేసిన అనంతరం హెచ్‌ఎంగా కొనసాగారు. ఈ నెల 27వ తేదీన భీమిలిలో అంత్యక్రియలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న పలువురు పూర్వ విద్యార్థులు దిగ్భ్రాంతికి గురయ్యారు.

దళితుల శ్మశానవాటిక ఆక్రమణలు తొలగించాలని వినతి

దేవరాపల్లి, జూలై 25 : మండల కేంద్రం దేవరాపల్లిలో దళితుల శ్మశాన వాటికలో ఆక్రమణలు తొలగించాలని అంబేడ్కర్ యూత్ సభ్యులు, కాలనీ పెద్దలు తహసీల్దార్ లక్ష్మీనారాయణకు గురువారం వినతిపత్రం అందజేశారు. సర్వే నెంబరు 274-1లో నాలుగు ఎకరాల 64 సెంట్లు భూమి ఉందని, దానిని ఆక్రమించు కోవడానికి పలువురు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.